
బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో..

# అతీంద్రియ శక్తులు

## తటవర్తి వీరరాఘవరావు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# అతీంద్రియ శక్తులు



రచన & ప్రచురణ : తటవర్తి వీరరాఘవరావు

ప్రథమ ముద్రణ : డిశంబరు, **2013**  ద్వితీయ ముద్రణ: అక్టోబరు, **2018**

ప్రతులు : **3,000**  ప్రతులు : **1,000**

తృతీయ ముద్రణ: ఫిబ్రవరి, **2021**

ప్రతులు : **1,000**

వెల : **రూ. 60/-లు**


**పుస్తకముల కొరకు**

**తటవర్తి వీరరాఘవరావు**

**తటవర్తివారి వీధి, భీమవరం-534201. ప॥గో॥జిల్లా.**

**సెల్: 9490171853, 9440309812**

email : balajipyramid.bvrm@gmail.com



# ధ్యానం చేసే పద్ధతి
# శ్వాసమీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

## ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన **ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం** నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

***ప్రవేశం*** : *మూడురోజులకు భోజనం, వసతి ఉచితం*

***వేదిక*** : *శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

వివరాలకు : **తటవర్తి వీరరాఘవరావు,** తటవర్తి వారి వీధి, **భీమవరం - 534 201.**
*సెల్ : 94403 09812, 94901 71853*

# అతీంద్రియ శక్తులు అవసరమా? ఎంతవరకు అవసరం?

మానవ ఇంద్రియాలతో చేయలేని పనులను అతీంద్రియ శక్తులు అంటారు. అలాగే మానవ ఇంద్రియాలతో తెలుసుకోలేని విషయాలను అతీంద్రియ జ్ఞానం అంటారు.

ఈ విషయాలు అంటే అతీంద్రియ జ్ఞానం, ఈ పనులు అంటే అతీంద్రియ శక్తులు సామాన్యులకు ఆశ్చర్యం కలిగిస్తూ వుంటాయి. కారణం ఈ విషయాలు వారికి తెలియవు కాబట్టి, ఈ పనులు వారు చేయలేరు కాబట్టి.

అటువంటి అతీంద్రియ జ్ఞానాన్ని దివ్యజ్ఞానం అంటారు. అటువంటి అతీంద్రియ శక్తుల్ని దివ్యశక్తులు అని కూడా అంటారు. అటువంటి దివ్యత్వం పొందిన వారిని 'దివ్యులు' లేక 'దేవుళ్ళు' అని లోకంలో పిలుస్తారు. అటువంటి దివ్యత్వం చాలా కొద్ది మందికే వస్తుంది. అటు వంటి స్థితి చాలా కొద్దిమందే సాధించగలరు. ఎటువంటి వారు అలాంటివి సాధించగలరో తెలుసుకుందాం.

లోకంలో చాలా కొద్ది మందికి మాత్రమే భౌతిక విషయాల పట్ల, భౌతిక భోగాల పట్ల, విరక్తి కలుగుతూ వుంటుంది. అంటే ఆసక్తి తగ్గిపోతుంది. యోగ వాశిష్టంలో వశిష్ఠ మహర్షి శ్రీరాముడికి బోధించిన విషయాలు యదార్ధాలని వారు అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు.



అవేమిటో కొద్దిగా తెలుసుకుందాం.

**శ్లో॥ అనన్తానీహ దుఃఖాని సుఖం తృణలవోపమమ్**
**నాతః సుఖేషు బధ్నీయాద్దృష్టిం దు:ఖానుబంధిషు**
**(యోగవాశిష్ఠం)**

తా:- ఈ ప్రపంచంలో దు:ఖాలు అనంతాలు, సుఖం గడ్డిపోచంత; కనుక, దు:ఖంతో కూడుకుని వున్న ఈ సాంసారిక సుఖాలలో దృష్టి వుంచరాదు.

వశిష్టుల వారు ఇంకా ఏమి బోధించారంటే...

**శ్లో॥ ప్రత్యహం ప్రత్యవేక్షత దేహం నశ్వరమాత్మన ః**
**సంత్యజేత్ప శుభిస్తుల్యం శ్రయేత్సత్పురుషోచితమ్.**

**(యోగవాశిష్టం)**


తా:- ప్రతిదినం 'ఈ శరీరం నశ్వరమైనది' (అశాశ్వతమైనది) అనే విషయాన్ని చింతన చేస్తూ వుండాలి. పశువులలాగ (అపరిమితంగా) విషయభోగాలలో ఆసక్తి కలిగి వుండటాన్ని త్యజించాలి. అంతేకాక సత్పురుషోచితాలైన సాధుజన సాంగత్య (సజ్జనసాంగత్యం) సచ్ఛాస్త్రాదుల (స్వాధ్యాయం) నాశ్రయించాలి.

**శ్లో॥ యదనస్తమనాయాసం తత్పదం సారసిద్ధయే**
**సాధనీయం ప్రయత్నేన పురుషేణ విజానతా.**

**(యోగవాశిష్టం)**

తా:- తెలివి గల మనుష్యుడు పురుషార్థ సిద్ధి కోసం, అనంతమైన దు:ఖరహితమైన ఆత్మపదాన్ని ప్రయత్నం ద్వారా సాధించాలి.

వశిష్ఠుల వారు బోధించినట్టుగా చాలా కొద్ది మంది మాత్రం ఎక్కువ దుఃఖాలతో కూడిన ఈ జీవితంలోని కొద్దిపాటి సుఖాల వల్ల విరక్తి చెంది, దుఃఖరహితమైన అంటే శాశ్వతంగా దుఃఖాల నుంచి బయటపడగలిగే ఆత్మ పదాన్ని, అంటే ఆత్మ సాక్షాత్కారాన్ని పొందడం కోసం ప్రయత్నిస్తారు.



అంతేకాదు శ్రీ ఆదిశంకరాచార్యుల వారు భజగోవిందం ద్వారా లోకానికి బోధించిన ఈ విషయాలు కూడా వారు అవగాహన చేసుకుంటారు. అవేమిటో తెలుసుకుందాం.

**"మా కురు ధన జన యౌవన గర్వం**
**హరతి నిమేషత్కాలః సర్వమ్ ।**
**మాయ మయ మిద మఖిలం భుత్వా**
**బ్రహ్మపదం త్వంప్రవిశ విదిత్వా ॥"**

తా:- "నీకు ఇంత ధనమున్నదనీ, నీ క్రింద ఇంతమంది జనులున్నారనీ, నీకు చక్కటి యవ్వనమున్నదనీ గర్వపడకు. కాలం నిమిషంలో సర్వాన్నీ హరించి

వేస్తుంది. కనపడే ఈ వున్నదంతా మాయామయమే. ఈ విషయం సదా జ్ఞప్తిలో వుంచుకోవడంలోనే 'బ్రహ్మపదం' లో ప్రవేశించే మార్గం వుంది."

అంతేకాకుండా శంకరాచార్యుల వారు ఇంకా

**"అర్థ మనర్థం భావయ నిత్యం**
**నాస్తి తతః సుఖ లేశః సత్యమ్**
**పుత్రాదపి ధనభాజాం భీతిః**
**సర్వత్రైషా విహితా రీతిః॥"**

తా:– "ధనమెప్పుడూ దుఃఖహేతువని మరచిపోకు. దానిలో కొద్దిపాటి సుఖం కూడా లేని మాట వాస్తవం. ధనవంతునికి తన కుమారుడి నుంచి కూడా భయం కలుగుతూ వుంటుంది. ఎక్కడైనా పరిస్థితి ఇంతే."

శంకరాచార్యుల వారు ధనం గురించే కాకుండా మానవులు సహజంగా మోహపడే కామ వికారాల గురించి కూడా వివరించడం జరిగింది.

**"నారీ స్తనభర నాభీదేశం**
**దృష్ట్వా మా గా మోహావేశమ్।ఔ**
**ఏతన్మాంస వసాది వికారం**
**మనసి విచిన్తయ వారం వారమ్॥"**

తా:– "యువతుల స్థనాలను, నాభీస్థలాన్ని చూసి అధికంగా మోహాన్ని చెందవద్దు. అవన్నీ కూడా మాంసం మరియు కొవ్వు పదార్థాల వినిర్మితాలే గానీ మరేమీ కాదు. ఈ సత్యాన్ని ప్రతిరోజూ మనసులో విచారణ చేసుకుంటూనే వుండాలి".

శ్రీ శంకరాచార్యుల వారు ఇంకా ఏమి చెప్పారంటే

**"కాతే కాంతా ధనగత చింతా**
**వాతుల కిం తవ నాస్తి నియంతా ।**
**త్రిజగతి సజ్జన సంగతి రేకా**
**భవతి భవార్ణవతరణే నౌకా ॥"**

తా:– "ఓ వెఱ్ఱివాడా! నీ భార్యను గూర్చి, ధనాన్ని గూర్చి ఎందుకంతగా చింతిస్తావు? ధర్మ పరిపాలన చేసే నియంత లేడనుకున్నావా? త్రికాలలో కూడా భవసాగరాన్ని దాటింపగల నౌక "సజ్జన సంగతి" మాత్రమేనని తెలుసుకో"

అని చెపుతూ శంకరాచార్యుల వారు ఇంకా ఏమి చెప్పారంటే

**"కా తే కాంతా కస్తే పుత్రః**
**సంసారోయమతీవ విచిత్రః ।**
**కస్య త్వం కః కుత ఆయాతః**
**తత్త్వం చింతయ తదిహ భ్రాతః !"**

తా:– "ఓయి సోదరుడా! తత్త్వాన్ని విచారించు. ఎవరు నీ భార్య? నీ పుత్రుడెవడు?

ఈ సంసారం అత్యంత విచిత్రమైనది. ఇంతకూ నీవెవరికి చెందిన వాడివి? ఎక్కడ నుంచి ఇక్కడకు వచ్చావు?" ఈ తత్త్వవిచారణ చేస్తే నీ భ్రాంతి మోహాలు పటాపంచలవుతాయి.

అలా శ్రీ ఆదిశంకరాచార్యుల వారు బోధించిన సందేశాన్ని పదే పదే అధ్యయనం చేయడం వల్ల ఆయన బోధించిందంతా సత్యమని తెలుసుకుంటారు. అసలు తాను ఎవరో? ఎక్కడ నుంచి వచ్చాడో? ఏమి చేయడానికి వచ్చాడో? తెలుసుకోవాలనే జిజ్ఞాస కలుగుతుంది. అప్పటి దాకా వేటి కోసం పరుగులు తీసారో ఆ పరుగులన్నీ ఆపేస్తారు. ఆలోచిస్తారు. వాటిని తెలుసుకోవడం కోసం ధ్యానమార్గంలోకి వస్తారు. ధ్యాన సాధన చేస్తూ ఇంకా ఎంతో మంది యోగుల గురించి, యోగులు చేసిన బోధల గురించి తెలుసుకోవాలని ప్రయత్నిస్తారు.

అలాంటి వారు కొన్ని ఆధ్యాత్మిక పుస్తకాలు అంటే ఆత్మకు సంబంధించిన, అంటే ఆత్మజ్ఞానాన్ని తెలిపే పుస్తకాలు చదువుతారు. ఆత్మజ్ఞానాన్ని బోధించేవారి ఉపన్యాసాలు వింటూ ఆత్మ సాక్షాత్కారం పొందటానికి సంబంధించిన 'ధ్యాన' సాధన చేస్తూ వుంటారు. అలాంటి వారిలో బహు కొద్దిమందికే 'ఆత్మ పదాన్ని' చేరుకోవాలనే విపరీతమైన తపన, 'ఆత్మ' గురించి తెలుసుకోవాలనే తీవ్ర జిజ్ఞాస వుంటుంది. అటువంటి వారు 'ధ్యాన' సాధన తీవ్రంగా చేస్తారు.

అలా తీవ్ర జిజ్ఞాసతో ధ్యాన సాధన ప్రారంభించి ధ్యాన సాధనతో పాటు, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం వల్ల ముముక్షత్వానికి దారి తీస్తుంది.

వీరికి ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి పూర్తిగా తగ్గిపోతుంది. ధనం సంపాదించాలని, భూములు, బంగళాలు సంపాదించాలని, బంగారం, నగలు సమకూర్చుకోవాలనే కోరికలు పూర్తిగా తొలగిపోతాయి. నా సంసారం, నా పిల్లలు, నా భార్య, నా భర్త, నా బంధువులు, నా స్నేహితులు అనే మమకారం పూర్తిగా తొలగిపోతుంది. వారిలో ఎటువంటి ఆశలు, కోరికలు వుండవు. ఏది వుంటే దానితోనే తృప్తి పడతారు. ఇతరులను కానీ, ఇతరులవి కాని చూసి అసూయ పడరు. ఆశపడరు. కారణం తనకు కావలసింది అవి కాదు కాబట్టి. కారణం అవన్నీ దుఃఖ కారకాలు అని తెలుసుకుంటారు. తనకు కావలసింది శాశ్వతంగా దుఃఖం నుంచి బయటపడటం, దానికి తాను పొందవలసింది 'ఆత్మ పదం' అన్న విషయం వారు అర్ధం చేసుకుంటారు. అదే వారి జీవిత ధ్యేయంగా పెట్టుకుంటారు. అందుచేత వీటన్నిటిని

తృణప్రాయంగా భావిస్తారు.

అంతేకాదు వారిలో నెమ్మదిగా నేను ఫలానా కులం, ఫలానా మతం, ఫలానా ప్రాంతం, ఫలానా దేశం అన్న భావం కూడా పూర్తిగా తొలగిపోతుంది. నేను అది సాధించాను, ఇది సంపాదించాను, నేను అంతటి వాడిని, ఇంత గొప్పవాడిని, ఇన్ని ఘన కార్యాలు చేసాను, వారు నాకంటే తక్కువ వారు, వారందరికంటే నేను అధికుణ్ణి లాంటి అహంకార భావాలన్నీ పూర్తిగా పోతాయి.

అలాంటి స్థితిలో వారి వల్ల ఎవరికి అపకారం కలగదు, ఎవరికీ అపకారం చేయరు. వారిని చూసి ఎవరూ భయపడరు. ఆఖరికి జంతువులు సైతం వారిని చూసి భయపడవు. కారణం వారు ఎవరికీ అపకారం కలిగించరు కనుక. అలాగే తాము సైతం ఎవరికీ భయపడరు, దేనికీ భయపడరు, ఏమి జరిగినా బాధపడరు, ఏదీ పట్టించుకోరు.

అంతేకాదు గతం గురించి ఆలోచించరు. జీవితంలో గతంలో జరిగిన సంఘటనలు, విషయాలు పూర్తిగా మరచిపోతారు. గుర్తుకు వచ్చినా పట్టించుకోరు. అలాగే భవిష్యత్తు గురించి కూడా ఆలోచించరు. ఏది జరిగితే అదే జరుగుతుందనే స్థితిలో వుంటారు, అన్నిటిని స్వీకరించగలిగిన స్థితిలో వుంటారు.

ఎంతసేపూ ప్రస్తుతం తాను చేసే ధ్యాన సాధన మీదే దృష్టి వుంచుతారు. పుస్తకాలు చదువుతూ, జ్ఞాన సందేశాలు వింటూ, జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అలాంటి వారు ఏమి చేసినా ఇతరులకు, ఇతర జీవులకు ఉపకారం కలిగే పనులే చేస్తారు కానీ అపకారం కలిగించే పనులు చెయ్యరు. అలాంటి స్థితిలో వున్న వారిని ముముక్షువు అంటారు. అలాంటి స్థితిలో వున్నప్పుడు, వారి ధ్యాన సాధన తీవ్ర స్థాయిలో వుండి; సాధన పరాకాష్టకు చేరుకున్నప్పుడు వారిలో వారికే ఆశ్చర్యం కలిగించే మార్పులు చోటు చేసుకుంటాయి. ఎప్పుడూ తెలియని విషయాలు తెలుస్తూ వుంటాయి. ఎప్పుడూ చేయలేని పనులు చేయగలుగుతూ వుంటారు. అలాంటివి జరుగుతున్నప్పుడు మొదట్లో తమకు తాము సహజంగానే ఆశ్చర్యపోవడం జరుగుతుంది. కొన్నిటిని నమ్మలేరు కూడా. అలా వారికి ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఎన్నో లేని శక్తులు కలుగుతూ వుంటాయి.

అలా ఎప్పుడూ చూడని దృశ్యాలు అంటే ఈ రెండు కళ్ళతో చూడలేని దృశ్యాలు, అక్కడే కూర్చుని చూడగలుగుతారు. అంటే ప్రపంచంలో దేనినైనా, ఏ ప్రదేశమైనా, అంటే సృష్టిలోని ఎన్నో ప్రదేశాలు, ఎన్నో లోకాలలోని వింతలు, విశేషాలు చూడగలుగుతారు. అలా ఈ రెండు కళ్ళతో చూడలేని వాటిని చూడగలిగే నేత్రాన్నే 'దివ్యనేత్రం' లేక 'మూడవ కన్ను' అని కూడా అంటారు. ఆ దృష్టిని 'దివ్యదృష్టి' అని అంటారు.

అలా 'దివ్యదృష్టి'ని సంపాదించుకున్న వారి శక్తి పెరిగే కొద్దీ వారి దివ్య నేత్రంతో చూడగలిగే పరిధి పెరుగుతూ వుంటుంది. అలా వారు గతానికి సంబంధించిన విషయాలు కొన్ని వందల సంవత్సరాల వెనక్కి... ఇంకా శక్తి పెరిగితే కొన్ని వేల సంవత్సరాల వెనక్కి కూడా చూడగలుగుతారు. అలా గతానికి సంబంధించిన విషయాలే కాదు. భవిష్యత్తు గురించి, భవిష్యత్తులో జరగబోయే విషయాలను కూడా చూడగలుగుతారు, తెలుసుకో గలుగుతారు. వారి శక్తిననుసరించి కొన్ని వందల సంవత్సరాలే కాదు. కొన్ని వేల సంవత్సరాల తరువాత జరగబోయేవి కూడా తెలుసుకోగలుగుతారు.

ఇలాంటి కోవకు చెందిన వారే "శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, నోస్ట్రడామస్" లాంటి వారు.



అలా వారి మూడవ కన్ను అంటే దివ్యదృష్టికి వున్న శక్తిని బట్టి తమ గత జన్మలు తెలుసుకోగలిగినవారు వున్నారు. అలాగే అందరి గత జన్మలు గురించి కూడా తెలుసుకోగలిగినవారూ వున్నారు. అలాగే తమ భవిష్యత్తు అందరి భవిష్యత్తు కూడా తెలుసుకోగలిగిన వారు వున్నారు. ఈ విషయమే శ్రీ కృష్ణుల వారు గీతలో చెప్పడం జరిగింది. ఆయన ఏమన్నారంటే

**శ్లో॥ బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।**
**తా న్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప ॥**

**(భ.గీ. 4-5)**

తా:- "ఓ అర్జునా! నీకూ నాకూ ఇంతవరకు అనేక జన్మలు గడిచాయి. వాటన్నిటిని నేనెరుగుదును కాని నీవెరుగవు".

పై సందేశాన్ని బట్టి యోగీశ్వరులైన శ్రీ కృష్ణునికి దివ్య దృష్టి వుందని తెలుస్తుంది. మానవుడైన అర్జునునకు లేదని కూడా తెలుస్తుంది. దీనిని బట్టి దివ్యనేత్రం సంపాదించుకున్నవారు ఉన్న చోటు నుండి కదలకుండా ప్రపంచంలోనే కాదు సృష్టిలో ఏదైనా చూడగలరు, దేనినైనా తెలుసుకోగలరని తెలుస్తుంది.

అలాగే అలాంటి సాధకులు మరికొన్ని శక్తులు కూడా ప్రదర్శించ గలుగుతారు. వారు ఉన్న చోటు నుండి కదలకుండా భూలోకంలోని ఏ ప్రదేశానికైనా తమ సూక్ష్మశరీరంతో వెళ్ళగలుగుతారు. భూలోకంలోనే కాదు సృష్టిలోని ఏ లోకాలకైనా వెళ్ళగలుగుతారు. దీనినే "సూక్ష్మ శరీర యానం" అని అంటారు. అలా ప్రయాణించగలగడం వల్ల వారు ఎన్నో సృష్టి రహస్యాలు తెలుసుకుంటారు. సామాన్య మానవులు తెలుసుకోలేని ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. సామాన్యులు కలుసుకోలేని ఎంతో మంది సూక్ష్మలోక వాసులను కూడా కలుసుకుంటారు. దీని వల్ల వారు సృష్టికి సంబంధించిన ఎంతో జ్ఞానం సంపాదించుకోగలుగుతారు. ఈ జ్ఞానమంతా అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారు.

అంతేకాదు ఈ కనబడే దేహం నుంచి సూక్ష్మశరీరం బయటకు రాగానే ఈ దేహం నేను కాదు, ఆత్మను అని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారు. అంటే తాను ఎవరో తెలుసుకోగలుగుతారు. అలా ఎన్నో లాభాలు "సూక్ష్మ శరీర ప్రయాణం" వల్ల వారికి కలుగుతాయి.

పై శక్తులే కాకుండా (1) విశ్వమయ ప్రాణశక్తి, (2) సిల్వర్ కార్డు అంటే భౌతిక శరీరాన్ని, సూక్ష్మ శరీరాన్ని కలిపే తీగ, (3) ఎథిరిక్ బాడీ అంటే ప్రాణమయ కోశం (4) టెలిపతి (5) క్లియర్‌వాయన్స్ అంటే దివ్యదర్శనం, (6) సైకోమెట్రీ అంటే స్పర్శ గ్రహణ విద్య, (7) క్లియర్ ఆడియన్స్ అంటే

దివ్యశ్రవణం లాంటి అనేక శక్తులు కూడా పొందే అవకాశం వుంది. అంటే అటువంటి శక్తులు అవసరాన్ని బట్టి వారికి ఇవ్వబడతాయి. వారికి ఏవి అవసరమో అవే ఇవ్వబడతాయి.

అలాంటి వారు, అంటే అంతటి ప్రయత్నం, సాధన చేసే వారు ఈ శక్తులతో పాటు ఒక్కొక్కసారి కొన్ని సిద్ధులు కూడా పొందగలుగుతారు. అలా పొందగలగడాన్నే సిద్ధత్వం అంటారు. అలాంటి సిద్ధులు పొందిన వారిని సిద్ధుడు అని కూడా పిలుస్తారు. పురాణాలలో ఇలాంటి సిద్ధులను 8 రకాలుగా పేర్కొన్నారు. వాటినే 'అష్టసిద్ధులు' అని కూడా అంటారు. అవి ఏమిటంటే?

**1) అణిమ :-** అంటే సూక్ష్మాతి సూక్ష్మరూపం ధరించ గలగడం,

**2) మహిమ:-** అంటే అతి పెద్ద రూపం ధరించ గలగడం,

**3) గరిమ :-** అంటే బరువుగా అయిపోవడం

**4) లఘిమ:-** అంటే అతి తేలికగా అయిపోవడం

**5) ప్రాప్తి :-** అంటే పొందవలసినవి పొందలగలగడం

**6) ప్రాకామ్యం:-**అంటే విశేషమైన కోరిక నెరవేర్చుకోగలగడం,

**7) ఈశత్వం :-** అంటే అందరి మీద ఆధిపత్యం సంపాదించడం,

**8) వశత్వం :-** అంటే అందరిని వశపరచు కోగలగడం.

అలాంటి సిద్ధులు రామాయణంలో ఆంజనేయస్వామి ప్రదర్శించడం మనందరికి తెలుసు.



అలా ధ్యాన సాధన చేసేవారు మానవ ఇంద్రియాలకు సాధ్యం కాని అతీంద్రియ శక్తులు సంపాదించడం వల్ల అతీంద్రియ జ్ఞానం సంపాదించుకునే అవకాశం కలుగుతుంది. సామాన్యులు తెలుసుకోలేని విషయాలు తెలుసుకుంటారు. అలా ఎంతో జ్ఞానం సంపాదించుకుంటారు.

అలాగే సిద్ధులు సమకూరడం వల్ల సామాన్యులు చేయలేని పనులు చేయగలుగుతారు. లోకానికి, లోకులకు ఎంతో మేలు చేయగలుగుతారు, లోక కళ్యాణకరమైన పనులు చేస్తారు. ఆ రకంగా తమ లక్ష్య సాధన సులభతరం చేసుకోగలుగుతారు.

వీటన్నిటి వల్ల సృష్టికి సంబంధించిన, సృష్టిలోని అనేకానేక లోకాలకు సంబంధించిన విషయాలు, రహస్యాలు, జ్ఞానం తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. అలా తమకు ఇంతకు ముందు తెలియని, సామాన్యులు తెలుసుకోలేని విషయాలు తెలుసుకుని ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకుంటారు. తద్వారా తమ జీవిత లక్ష్యమైన, "ఆత్మ జ్ఞానాన్ని" సంపాదించుకుని తమ జీవిత పరమార్థమైన "ఆత్మ పదాన్ని" సాధించగలుగుతారు. తాము ఇంతకాలం ఎదురు చూస్తున్న, కోరుకుంటున్న ముక్తి; అంటే దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడగలుగుతారు.

పై విషయాలను బట్టి సూక్ష్మంగా మనం తెలుసుకోవలసింది ఏమిటంటే, మానవులు తమ కష్టాల నుంచి, సమస్యల నుంచి, బాధల నుంచి అంటే దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడాలనే తపనతో ప్రాపంచిక విషయాల పట్ల విరక్తి పొంది, విషయ భోగాల పట్ల ఆసక్తి వదలి, "ఆత్మజ్ఞానాన్ని", "ఆత్మ సాక్షాత్కారాన్ని" పొందటానికి తీవ్రమైన కృషి అంటే ధ్యాన సాధన చేస్తున్నప్పుడు సహజంగానే వారి లక్ష్యం సాధించడానికి కావలసిన సహకారం వారికి సృష్టి నుంచి లభిస్తుంది.

ఆ రకంగా వారి సాధనా తీవ్రతని బట్టి వారికి కావలసిన, వారు పొందవలసిన జ్ఞానానికి కావలసిన శక్తులు కాని, సిద్ధులు కని, ఏది అవసరమో అది ఆటోమేటిక్‌గా సృష్టి నుంచి సమకూర్చబడతాయి. అంటే అలాంటి శక్తులు సాధన చేస్తున్నప్పుడు సహజంగానే వస్తాయి. వాటి కోసం వారు ప్రత్యేకించి ప్రయత్నించవలసిన అవసరం లేదు, కోరవలసిన అవసరం కూడా ఉండదు,

రాదు. కారణం సృష్టిలో **"చేయవలసిన సాధన చేస్తూ వుంటే పొందవలసినవి ఆటోమేటిక్‌గా పొందుతూ వుంటారు".**

అలా ధ్యాన సాధన చేసేవారు సాధనా తీవ్రతని బట్టి సహజంగా పొందేవే పైన పేర్కొనబడిన శక్తులు. అంతేకాదు కొంతమంది కొన్ని సిద్ధులు కూడా సంపాదించు కుంటారు. ఇవన్నీ తమ లక్ష్యాన్ని సాధించుకోవడానికే కానీ మరి దేని కోసం కాదు. తెలివైన వారు అలా సంపాదించుకున్న శక్తులతో, సిద్ధులతో, తమ లక్ష్యాన్ని తేలికగా సాధించుకుంటారు, గమ్యాన్ని చేరుకుంటారు.

కానీ అలా సాధించిన వారిలో కొద్దిమంది అలాంటి శక్తులు, సిద్ధులు సాధించినపుడు వాటిని చూసి గర్వంతో, అహంకారంతో తమ లక్ష్యాన్ని మరచి, వాటిని తమ లక్ష్య సాధనకు వుపయోగించకుండా తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. విషయ భోగాలపై ఆసక్తి ప్రదర్శిస్తూ వుంటారు. అందరికంటే గొప్పవారుగా అనిపించుకోవాలని చూస్తారు. ఆ శక్తులను సృష్టి విరుద్ధమైన కార్యాలకు, పనులకు ఉపయోగిస్తారు, సృష్ఠి విరుద్ధమైన పనులు చేస్తారు, సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తారు. తమ శక్తులు ప్రదర్శిస్తూ అందరినీ మోసగిస్తారు, ఇతరులకు తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటారు. తమను కాదన్న వారిని, తమను ఎదిరించిన వారిని తమ శక్తిని చూపి బెదిరిస్తారు, వేధిస్తారు, రకరకాల భాదలకు గురి చేస్తారు. మాయమాటలతో మంత్ర, తంత్రాలు అంటూ మోసగిస్తారు, అన్ని రకాలుగా సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తారు.

అలాంటి వారు తమ శక్తులను లోక కళ్యాణకరమైన పనులకు ఉపయోగించరు. లోక క్షేమం కోసం ఉపయోగించరు. అలా ప్రవర్తించే వారికి సహజంగానే సృష్టి నుంచి సంపాదించుకున్న శక్తులు, సిద్ధులు వారి నుంచి వెనక్కు తీసుకోబడతాయి. అంటే వారికి ఆ శక్తులన్నీ మాయమవుతాయి. ఆ సిద్ధులు పని చెయ్యవు. వారు మరల మామూలు మనుష్యులై పోతారు.

ఎందుచేతనంటే సహజంగా అలాంటి శక్తులు పొందిన వారికి ప్రకృతిలో కొన్ని పరీక్షలు పెట్టబడతాయి. ప్రకృతిచే పెట్టబడిన అటువంటి పరీక్షలలో వారు ఉత్తీర్ణులవుతేనే వారు శక్తులు పొందటానికి అర్హులవుతారు. అలా ప్రతీ స్థాయిలో కూడా ఈ సాధకులు ప్రకృతి పరీక్షలు ఎదుర్కొనవలసి వస్తుంది. అవి ఎలా వుంటాయంటే అవి ప్రకృతిచే పెట్టబడిన పరీక్షలని కూడా వారికి తెలియదు. అలాంటి పరీక్షలలో ఉత్తీర్ణులు కాలేకపోతే ఒకవేళ వారు

ఆ శక్తులు పొందినా... అవి మరల కోల్పోవడం జరుగుతుంది.

అటువంటి వారికి ముఖ్యంగా మూడు విషయాలలో పరీక్షలు పెట్టబడతాయి. అవి ఏమిటంటే (1) కీర్తి, (2) కాంత, (3) కనకం. వీటినే (1) క్రోధము (అహంకారం), (2) కామము (కోరిక), (3) లోభము (ఆశ) అని కూడా అంటారు.

ముఖ్యంగా జ్ఞానికి వుండకూడని లక్షణాలు కామ, క్రోధ, లోభాలే. అందుకే జ్ఞానం పొందాలనే కాంక్ష వున్న వారికి ప్రకృతిచే ఆ విషయాలలోనే పరీక్షలు పెట్టబడతాయి. ఆ పరీక్షలు అందరికీ ఒకే రకంగా వుండవు. ఒక్కొక్కరికి ఒక్కోరకంగా వుంటాయి. అవి పరీక్షలనే విషయం కూడా వారికి అర్థం కాదు.

సహజంగా అలాంటి శక్తులు పొందిన వారు, నలుగురిలో అశక్తులు ప్రదర్శిస్తున్నప్పుడు ఇతరులను, సామాన్యులను ఆశ్చర్య చకితులను చేస్తాయి. ఆశ్చర్యపోతారు కూడా. అపుడు వీరిని అందరూ ప్రశంసించడం, పొగడడం చేస్తూ వుంటారు. మీరు సామాన్యులు కాదు. దైవాంశ సంభూతులు, ఎవరూ చేయలేని పనులు చేస్తున్నారు. ఎవరూ చెప్పలేని విషయాలు చెపుతున్నారు. మీ లాంటి వారు వుండరు, మీరు అంత గొప్పవారు, ఇంత గొప్పవారు అని ప్రశంసిస్తూ వుంటే వీరిలో గర్వం పెరుగుతుంది. అంతేకాదు నేను కాబట్టి సాధించగలిగాను, నేను కాబట్టి ప్రదర్శించ గలుగుతున్నాను, నేను కాబట్టి చెప్పగలుగుతున్నాను, అందరి కంటే నేనే గొప్పవాడిననే అహంకారం పెరుగుతుంది. అలా వారు అందరి నుంచి పొగడ్తలు, ప్రశంసలు పొందాలని చూస్తారు. అందరిలో పేరు రావాలని తపన పడతారు. అందరిలో ఇంకా ఇంకా గొప్ప వారు కావాలని, ఇంకా ఎక్కువ మందిలో తాను పేరు తెచ్చుకోవాలని తపన పడతారు. అలా తన పేరు, కీర్తి దశ దిశలా వ్యాపించాలని కాంక్షిస్తారు, ఆశపడతారు, ప్రయత్నిస్తారు.

అలా తాను గొప్పవాడినని భావిస్తూ అందరినీ తక్కువగా చూడటం, చిన్న చూపు చూడటం, అందరిచేత పాదాభివందనాలు చేయించుకోవడం, పాద పూజలు చేయించుకోవడం చేస్తూ వుంటారు. ఇది ఎంతటి పరాకాష్టకు చేరుకుంటుందంటే ఒకవేళ ఎవరైనా అలా చెయ్యకపోతే వీరి అహం దెబ్బతింటుంది. అవకాశం దొరికితే అలా చెయ్యని వారి పట్ల ప్రతీకారం కూడా తీర్చుకుంటారు. వారిని అవమానిస్తారు కూడా. చివరకు వీరు తానే గొప్పవాడిననే గర్వంతో, అహంకారంతో చెయ్యకూడని పనులు చేస్తూ వుంటారు.

సృష్టి విరుద్ధమైన పనులు చేస్తూంటారు. ప్రకృతి విరుద్ధంగా ప్రవర్తిస్తారు. ఇతరులను, సామాన్యులను, అమాయకులను తమ స్వలాభాలకు ఉపయోగించుకుంటారు. అలా తనకు ఇవ్వబడిన శక్తులు, జ్ఞానం తన లక్ష్యానికి కాకుండా ప్రకృతి విరుద్ధమైన కార్యకలాపాలకు ఉపయోగించడం వల్ల సహజంగా ప్రకృతిచే పెట్టబడిన “కీర్తి” అనే పరీక్షలో వారు విఫలులవ్వడం వల్ల, సహజంగానే ప్రకృతిచే ఇవ్వబడిన శక్తులు వారు కోల్పోవలసి వస్తుంది. అంటే ప్రకృతిచే వెనక్కు తీసుకోబడతాయి. అలా వారు సంపాదించుకున్నవి కోల్పోతారు. మరల మొదటికి వస్తారు. అంటే మామూలు మనుషులై పోతారు.

ఒకవేళ ఎవరైనా ఈ కీర్తి అనే పరీక్షలో ఉత్తీర్ణులై తనకు ఎంత తెలిసినా, ఎన్ని శక్తులు వున్నా గర్వము, అహంకారం లేకుండా మామూలుగానే ప్రవర్తిస్తూ వుంటే వీరికి తెలియకుండానే వీరు మరొక పరీక్ష ఎదుర్కోవలసి వస్తుంది.

సహజంగా వీరు స్త్రీ అయితే పురుషులు, వీరు పురుషులయితే స్త్రీలు వీరు చెప్పే మాటల పట్ల, వీరు చేసే పనుల పట్ల, వీరు ప్రదర్శించే శక్తుల పట్ల ఆకర్షితులై వీరితో చనువుగా ప్రవర్తిస్తారు. దగ్గర కావడానికి ప్రయత్నిస్తారు. వారిలో కొంతమంది వీరికి పూర్తిగా దాసోహమైపోతారు. అటువంటి స్త్రీల వ్యామోహంలో వీరు పడినట్లయితే... ఆ బలహీనత వీరిలో ప్రవేశించినట్ల యితే... వారి పట్ల వీరి ప్రవర్తన మారిపోతుంది. వారితో అసభ్యంగా ప్రవర్తించడం, చేయకూడని పనులు చేయడం చేస్తూంటారు.

మెల్లిగా వీరికి అది ఒక వ్యసనంలా మారిపోతుంది. తాను అనుభవించే వారి మీదే కాకుండా అందరి మీదా వీరి దృష్టి పడుతుంది. అలా తనకు నచ్చిన వారందరినీ అనుభవించాలని ప్రయత్నిస్తారు. దానికి ఏదో రకంగా వారిని లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తారు. దాని కోసం తన తెలివిని రకరకాలుగా ప్రదర్శిస్తారు. మాయ మాటలు చెపుతారు. నీవు గత జన్మలో నా భార్య అని చెపుతారు, నీవు నేను ప్రేమికులమని... లాంటి రకరకాల మాయమాటలు చెపుతారు. తమ శక్తుల్ని ప్రదర్శిస్తారు, చూపిస్తారు. ఏదో రకంగా తన వాంఛల్ని తీర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తారు. అలా తమ లక్ష్య సాధనకు ఇవ్వబడిన శక్తుల్ని లక్ష్య సాధనకు ఉపయోగించకుండా తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడానికి ప్రయత్నించడం వల్ల, సృష్టి విరుద్ధంగా ఉపయోగించడం వల్ల, ప్రకృతిచే పెట్టబడిన ‘కాంత’ అనే పరీక్షలో అంటే కామము అనే పరీక్షలో విఫలుడవ్వడం

వల్ల సహజంగానే ప్రకృతిచే ఇవ్వబడిన శక్తులు, తిరిగి ప్రకృతిచే ఉపసంహరింప బడతాయి. అంటే వారు కోల్పోతారు. తిరిగి మామూలు మనుష్యులై పోతారు.

అలాంటి పరీక్షలు కూడా అధిగమించిన వారు ఈ ప్రకృతిలో ఇంకొక పరీక్ష కూడా ఎదుర్కోవలసి వుంటుంది. వీరికి అయాచితంగా ధనం వస్తూంటుంది. వీరి పనులు, వీరి శక్తులు చూసి వీరు ఎంతో గొప్పవారనే ఉద్దేశ్యంతో చాలా మంది వీరు అడగకుండానే వీరికి ధనం, బంగారం, ఇంకా రకరకాల వస్తువులు ఇస్తూ వుంటారు. మొదట్లో వీరు అంత ఆసక్తి చూపించకపోయినా అలా అందరూ ఇస్తూ వుంటుంటే మెల్లిగా తీసుకోవడం మొదలు పెడుతూ వుంటారు. అలా మెల్లి, మెల్లిగా ధనంపై వ్యామోహం పెరుగుతూ వుంటుంది. మెల్లిగా ఆశ కూడా పెరుగుతూ వుంటుంది. ఆ ఆశతో ధనం పెంచుకోవడం కోసం లోకకళ్యాణం అంటూ అందరి నుంచి చందాలు వసూలు చేయడం, రకరకాల ప్రాజెక్టులు పెట్టి డబ్బులు వసూలు చేయడం, ఆశ్రమమంటూ, రకరకాల పనులు, కార్యక్రమాలు అంటూ చందాలు వసూలు చెయ్యడం, అది ఇస్తాను, ఇది చేస్తాను అంటూ డబ్బులు బాగా వసూలు చెయ్యడం చేస్తూ వుంటారు. ఆధ్యాత్మిక ముసుగులో ధనార్జన చేస్తూ వుంటారు. ఆధ్యాత్మిక కేంద్రాలని, అవనీ, ఇవనీ రకరకాలుగా ధనం సంపాదించడానికి ప్రయత్నిస్తారు. చివరకు వీరి లక్ష్యం మరచిపోయి ధనార్జనే లక్ష్యంగా జీవిస్తుంటారు. ధనం సంపాదించడానికి ధనం ఇంకా ఇంకా పెంచుకోవడానికి రకరకాల పనులు, చేయకూడని పనులు చేస్తారు. సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తారు. ఈ రకంగా అన్నీ వదులుకున్నవారు చివరకు అన్నిటి కోసం తాపత్రయ పడుతూ ప్రకృతిచే పెట్టబడిన "కనకం" అంటే "ధనం" అనే పరీక్షలో ఓడి పోవడం వల్ల తమ శక్తులు కోల్పోవలసి వస్తుంది. అలా మరల మామూలు మనుషులై పోతారు, శక్తిహీనులై పోతారు.

ఈ మూడు రకాలైన పరీక్షలు సృష్టిలో వుంటాయనేది పురాణాలలోని విశ్వామిత్రుని జీవితం ద్వారా మనం తెలుసుకోవచ్చు.

పూర్వం విశ్వామిత్రుడు 1000 సంవత్సరాలు తపస్సు చేశాడు అంటే 'ధ్యానం' చేశాడు. అందువల్ల ఆయన అపారమైన శక్తి సంపాదించుకున్నాడు. ఎంత శక్తి సంపాదించాడంటే సృష్టికి ప్రతిసృష్టి చేయగలిగినంత శక్తి సంపాదించాడు. అలా అపారమైన శక్తిని సంపాదించిన విశ్వామిత్రుని చూసి ఇంద్రుడు భయపడ్డాడు. అంతటి శక్తి సంపాదించిన విశ్వామిత్రుడు లోకానికి



మేలు చేస్తాడా? కీడు చేస్తాడా? అన్న సందేహంతో విశ్వామిత్రుడ్ని పరీక్షించదలుచుకున్నాడు.

మేనకను పంపించాడు. మేనక సౌందర్యాన్ని చూసి విశ్వామిత్రుడు మోహించాడు. నన్ను వివాహం చేసుకోమని కోరాడు. అపుడు మేనక ఒక షరతు పెట్టింది. ఏమని? ఎప్పుడయితే నా కోరిక కాదంటావో... అపుడు నిన్ను వదిలి వెళ్ళిపోతాను అంది. దానికి విశ్వామిత్రుడు అంగీకరించాడు. ఇద్దరూ వివాహం చేసుకున్నారు. కాపురం చేస్తున్నారు. కానీ ప్రతీ రోజు మేనక విచిత్రమైన కోరికలు కోరేది. మల్లెపూలు లేని కాలంలో మల్లెపూలు కోరేది. మామిడిపళ్ళు లేని కాలంలో మామిడిపళ్ళు కోరేది. ఆవిడ మాట కాదనలేని విశ్వామిత్రుడు ఆవిడ కోరిక తీర్చడానికి తాను సంపాదించిన శక్తిని కొంత ఖర్చు పెట్టి మల్లెపూలు సృష్టించేవాడు, మామిడిపళ్ళు సృష్టించేవాడు, ఒక్కోసారి నీతో కలిసి ఆకాశంలో విహరించాలని వుంది అనేది. అలా మరి కొంత శక్తి ఖర్చు పెట్టి ఆమె కోరిక తీర్చేవాడు. ఇలా రకరకాల వింత కోరికలు మేనక కోరేది. ఆమె కోరికలు తీరుస్తానని మాట ఇచ్చిన విశ్వామిత్రుడు తన శక్తిని ఖర్చు పెడుతూ ఆమె కోరికలు తీర్చేవాడు.

అలా వుంటూ వుండగా మరల ఒకసారి ఆకాశ విహారం చేద్దామని మేనక మరల కోరింది. అపుడు విశ్వామిత్రుడు సరేనని చేతులు పైకి ఎత్తి... పైకి వెళ్దామనుకున్నాడు. కానీ ఈసారి పైకి లేవలేకపోయాడు. ఎంత ప్రయత్నించినా పైకి లేవలేకపోయాడు. అపుడు విశ్వామిత్రునికి అర్థమయ్యింది.

తాను 'తపస్సు' అంటే 'ధ్యానం' ద్వారా సంపాదించిన శక్తి అంతా కర్చు అయిపోయిందని తెలుసుకున్నాడు. అపుడు మేనకతో... నా శక్తి అంతా కర్చుయిపోయింది. నేను పైకి లేవలేకపోతున్నాను అన్నాడు. అపుడు మేనక తాను పెట్టిన షరతు గుర్తు చేసి విశ్వామిత్రుణ్ణి వదిలేసి తాను స్వర్గానికి వెళ్ళిపోయింది. అపుడు విశ్వామిత్రుడు చాలా బాధపడ్డాడు. తాను 1000 సంవత్సరాలు ఎంతో కష్టపడి చేసిన తపఃశ్శక్తి అంతా కర్చుయిపోయిందే! మేనక కోరికలు తీర్చడం కోసం ఎంత శక్తిని నేను కోల్పోయాను అని బాధపడ్డాడు. ఎందుచేతనంటే 1000 సంవత్సరాలు అంటే మాటలా! ఎంత కష్టపడ్డాడు? ఎంత కష్టపడి తపస్సు (ధ్యానం) చేసాడు? తాను పడిన కష్టం, సంపాదించిన శక్తి రెండూ వృధాయే కదా? పోనీ మేనకైనా వుందా? అంటే ఆవిడ కూడా వెళ్ళిపోయింది. ఇపుడు ఏమి వుందంటే ఏదీ లేదు. అలా ఎంత బాధపడినా ప్రయోజనం లేదు కదా? కోల్పోయిన శక్తి తిరిగి రాదు కదా? చేసేది లేక మరల తపస్సు ప్రారంభించాడు. మరల 1000 సంవత్సరాలు 'తపస్సు' అంటే 'ధ్యానం' చేశాడు. మరల అపారమైన శక్తిని సంపాదించగలిగాడు.

ఈసారి ఇంద్రుడు రంభను పంపాడు. రంభను చూడగానే విశ్వామిత్రునికి విపరీతమైన కోపం వచ్చింది. ఇంద్రుడు నన్ను తెలివి తక్కువ వాడనుకుంటున్నాడు. వాడి పని చెపుతానని ఆగ్రహించి రంభను శిలగా మారిపొమ్మని శపించాడు. కానీ అలా శపించడం వల్ల మరల శక్తినంతా కోల్పోయాడు. ఈసారి విశ్వామిత్రుడు క్రోధం వల్ల అంటే కోపం అంటే అహంకారం వల్ల తన శక్తినంతా కోల్పోయాడు. మరల మామూలు మనిషి అయిపోయాడు. మరల ఎంతో బాధపడ్డాడు.

చేసేది ఏమీ లేక మరల పట్టుదలతో తపస్సు ప్రారంభించాడు. ఈ సారి కూడా 1000 సంవత్సరాలు 'తపస్సు' అంటే 'ధ్యానం' చేసి మరల అంతటి శక్తిని సంపాదించాడు. ఈసారి ఇంద్రుడు లోభానికి పరీక్ష పెట్టాడు. అంటే ధనం విషయంలో ఎలా ప్రవర్తిస్తాడో చూడాలనుకున్నాడు. కారణం ఇంతకు ముందు కామానికి, క్రోధానికి పరీక్ష పెట్టాడు కనుక.

ఒకరోజు విశ్వామిత్రుడు భోజనం చేద్దామని భోజనం దగ్గర కూర్చున్నాడు. అదే సమయానికి ఇంద్రుడు మారువేషంలో విశ్వామిత్రుని ఇంటికి వచ్చి భోజనం పెట్టమని అర్థించాడు. అపుడు విశ్వామిత్రుడు ఆలోచించాడు. ఇంద్రుడు తనను ఈ రకంగా పరీక్షంచడానికి వచ్చాడని తెలుసుకున్నాడు.

వెంటనే ఇంద్రుణ్ణి పిలిచి తాను తినబోయే ఆహారాన్ని ఇచ్చేసాడు. అపుడు ఇంద్రుడు తన నిజ రూపాన్ని చూపించి విశ్వామిత్రా లోభం విషయంలో నిన్ను పరీక్షించదలచుకున్నాను. నువ్వు నెగ్గావు! నువ్వు ఇపుడు అసలైన బ్రహ్మ జ్ఞానివి అయ్యావు, బ్రహ్మర్షివయ్యావు అని కీర్తించి అదృశ్యమయ్యాడు.

పై పురాణ కథను బట్టి ఎవరికైనా సృష్టిలో ఈ రకమైన పరీక్షలు వుంటాయని మనం తెలుసుకోవచ్చు. అందుచేత శక్తులు సంపాదించిన వారు గర్వించకూడదు, విర్రవీగకూడదు, అహంకారం ప్రదర్శించకూడదు. స్త్రీ ఆకర్షణ లో పడకూడదు. ధనానికి ఆకర్షితులు కాకూడదు. కామ, క్రోధ, లోభాలను జయించాలి. వారి అదుపులో వుంచుకోవాలి. అటువంటి వారే 'జ్ఞానులు'. వారికే ఈ సృష్టిలో 'జ్ఞానం' పొందే అర్హత వుంటుందని తెలుసుకోవాలి.

ప్రస్తుతం చాలా మంది ధ్యానులు, ధ్యాన లక్ష్యమేమిటో తెలుసుకోలేక, ధ్యానం ఎందుకు చేస్తున్నారో తెలియక ఇటువంటి శక్తుల కోసం చూస్తున్నారు. అటువంటి అనుభవాల కోసం ఆశపడుతున్నారు. వాటితో తమ సరదాలు తీర్చుకోవచ్చని భావిస్తున్నారు. అందరిలో గొప్పతనాన్ని ప్రదర్శించ డానికి ప్రయత్నిస్తున్నారు. అనుభవాల కోసమే ధ్యానమన్నట్టుగా భావిస్తున్నారు. ఎంతసేపూ... ధ్యాన సాధన కంటే అనుభవాలు వచ్చాయా? లేదా? అన్న దానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. అలాంటి వాటిలో కొద్దిపాటి అనుభవం కలిగినా గొప్పలు చెప్పుకోవటానికి, అందరిలో తన గొప్పతనం ప్రదర్శించటానికి ప్రయత్నిస్తున్నారు. గొప్పలు చెప్పుకుంటున్నారు. అవి విన్న వారిలో చాలా మంది ధ్యానం ప్రారంభించగానే అనుభవాల కోసం చూస్తూ వుంటారు. అనుభవాలు రాకపోతే నిరాశ పడుతూ వుంటారు. అలాంటి అనుభవాలు చెప్పేవారిని చూసి తాము పొందలేక పోయామని బాధపడుతూ వుంటారు.

అటువంటి వారు ఎక్కువ వుండబట్టే వారిని ఆకర్షించడానికి, వారిని ఆకర్షించి తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడానికి ఎంతో మంది ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తున్నారు. ప్రలోభపెడుతున్నారు. రకరకాలుగా మోసగిస్తున్నారు.

అందుచేత తెలుసుకోండి మానవునకు అతీంద్రియ శక్తులు అవసరమే! దేనికి అంటే? జీవితంలో దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడటానికి కావలసిన 'ఆత్మ జ్ఞానం' సంపాదించటానికి, 'ఆత్మ సాక్షాత్కారం' పొందటానికి. కారణం ఆ శక్తులే లేకపోతే ఎవరైనా సృష్టిలోని అతీంద్రియ జ్ఞానం

సంపాదించుకోలేరు. లక్ష్యాన్ని సాధించలేరు.

అందుచేత **"అతీంద్రియ శక్తులు మానవునకు తప్పనిసరిగా అవసరమే. ఎంతవరకు అవసరమంటే ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకొనడానికి, ఆత్మపదాన్ని సాధించుకోవడానికి మాత్రమే కాని, మరే ఇతర ప్రయోజనాల కోసం కాదని తెలుసుకోవాలి".**

ఏది ఏమైనా ఈ అనుభవాలు, శక్తులు, శిద్ధులు సరదాలు తీర్చుకోవడానికి, సమస్యలు పరిష్కరించు కోవడానికి, ప్రాపంచికమైన కోరికలు నెరవేర్చుకోవడానికి, స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడానికి మాత్రం కాదు. మానవుడు జ్ఞానం సంపాదించుకోవడానికి, పరిపూర్ణ జ్ఞాని కావడానికి అనుభవ పూర్వకంగా ఆత్మజ్ఞానం తెలుసుకోవడానికేనని తెలుసుకోవాలి. అసలు మానవ జీవిత లక్ష్యం ఇదే.

అందుచేత ధ్యాన సాధన చేసేవారు, అనుభవాల మీద, శక్తుల మీద దృష్టి వుంచకండి, వాటి గురించి ఆలోచించకండి. అసలు ఎంతజ్ఞానం సంపాదించాము? ఎంత జ్ఞానవంతులయ్యాము? మన ప్రవర్తన ఎంత మారింది? జ్ఞానపరంగా ఎంత ఎదిగాము? మన పనులు, ప్రవర్తన ఇతరులకు ఆదర్శంగా వున్నాయా? లేదా? అన్న వాటి మీద దృష్టి వుంచండి.

అందుచేత ఎన్ని రకాల అనుభవాలు వచ్చాయి? అన్నది ప్రధానం కాదు. ఇంతకు ముందుకి, ప్రస్తుతానికి ప్రవర్తన ఎంత మారింది? అన్నదే ప్రధానమని తెలుసుకోవాలి. ధ్యాన సాధన ద్వారా అనుభవాలు సంపాదించినా ప్రవర్తన మారకపోతే చేసిన సాధన అంతా వ్యర్థమని కూడా తెలుసుకోవాలి. ముఖ్యంగా **"కావలసింది జ్ఞానం – రావలసింది మార్పు"** అని తెలుసుకోండి.

అందుచేత మీరు మీ గత జన్మ ఒకటి చూసుకున్నా! ఏదో ఒక సమస్య పరిష్కరించుకున్నా, ఒక రోగం తగ్గించుకున్నా పెద్దగా ప్రయోజనం లేదని తెలుసుకోండి. కారణం ఒక సమస్య పరిష్కారమైనంత మాత్రాన లాభం లేదు. మానవునకు ఎన్నో సమస్యలు వుంటాయి. ఒక వేళ ఒక సమస్య పరిష్కారమైనా ఇంకొక సమస్య వస్తుంది. ఒక రోగం తగ్గినా మరొక రోగం వస్తుంది. అలా జీవితంలో ఎన్నెన్నో సమస్యలు, కష్టాలు వుంటాయి. అంతేకాదు గత జన్మ చూసుకున్నాం సరే! మన ప్రవర్తనలో మార్పు రాకపోతే ప్రయోజనమేమిటి? 'జ్ఞానం' కలగకపోతే లాభమేమిటి? ఆలోచించండి. అలా గత జన్మ చూసుకోవడమన్నది సరదా కోసమే తప్ప అంతకన్నా ప్రయోజనమేమి లేదు.

మానవునకు ఎన్నో సరదాలు వుంటాయి. అందులో ఇదొక సరదా మాత్రమే.

ఎందుచేతనంటే ఈ సృష్టిలో ఏది జరిగినా! ఏమి జరిగినా అంతా మంచికే! కారణం గత జన్మల మరుపే కాదు, గతం యొక్క మరపు అన్నది మానవులకు 'ప్రకృతి'చే ఇవ్వబడిన ఒక వరం. కారణం గతాన్ని మరువకపోతే మానవుడు శాంతిగా జీవించలేడు, వర్తమానంలో జీవించలేడు. అందుచేత ప్రకృతి ఏమి చేసినా మానవుల మంచి కోసమే, ఆలోచిస్తే ప్రకృతి చేసేవన్నీ మానవులకు లాభం కలిగించేవే.

ఎందుచేతనంటే ప్రస్తుతం లోకంలో గమనిస్తే ఎవరికీ శాంతి లేదు. దీనికి ముఖ్య కారణం గతంలో వారి జీవితంలో జరిగిన దుఃఖకర సంఘటనలు మరచిపోలేకపోవడమే. ఎందుచేతనంటే ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక సంఘటన జరుగుతూనే వుంటుంది. వ్యాపారంలో నష్టం రావడం, కుటుంబంలో గొడవలు జరగడం, ఏదైనా ఏక్సిడెంటు జరగడం, రాజకీయాల్లో ఓడిపోవడం, పరీక్షల్లో ఫెయిల్ కావడం, లేకపోతే భార్య కానీ, భర్త కానీ, పిల్లలు కాని చనిపోవడం, పెద్ద జబ్బు పడటం లాంటివి ఎన్నో జరుగుతూ వుంటాయి.

అవి జరిగినపుడు దుఃఖపడటం, బాధపడటం తద్వారా శాంతి కోల్పోవడం అన్నది సహజం. కానీ ఆ సంఘటన జరిగిన మూడు మాసాలైనా, ఆరు మాసాలైనా, మూడు సంవత్సరాలైనా గుర్తు వస్తే మరల జరగకపోయినా జరిగినట్టుగా దుఃఖపడతారు. శాంతిని కోల్పోతారు. అలా ఎన్ని సార్లు గుర్తుకు వస్తే అన్నిసార్లు అశాంతికి గురవుతారు. దీనికంతటికీ కారణం జరిగిన సంఘటన మర్చిపోకపోవడమే. అంటే గతాన్ని మరవలేకపోవడమే.

వారే కనుక జరిగిన గతాన్ని మరచిపోగలిగితే, వర్తమానంలో జీవించగలిగితే వారు శాంతిగా జీవించి వుండగలిగేవారు. అందుకే అలాంటి సంఘటనలు జరిగిన వారు జరిగిన విషయాలు మరచిపోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. గురువులను ఆశ్రయిస్తారు. ప్రదేశాలు మారుస్తారు. ఎన్నో తిప్పలు పడుతూ వుంటారు. ఇదంతా గతాన్ని మరచిపోవటానికే కదా? అంటే గతం యొక్క మరపు అన్నది అవసరమే కదా?

ఏది ఏమైనా సృష్టిలో వున్న ఏర్పాటు ఏమిటంటే గతాన్ని మరచి పోగలగటం, అదే లేకపోతే ఎవరూ జీవించలేరు. ఉదాహరణకి భార్యాభర్తలనే తీసుకుందాం. చాలా మంది తరచూ గొడవలు పడుతూ వుంటారు. కానీ ఆ గొడవ మరచి పోయేంత వరకు ఇద్దరూ దగ్గర కాలేరు. మరల ఒక్కటి

కాలేరు. వారిద్దరినీ కలిపేది మరుపే.

అలాగే రెండు వర్గాల మధ్య గొడవలు జరిగితే మధ్యవర్తులు రాజీ చేయటానికి కొన్నాళ్ళు వాయిదా వేస్తారు. కారణం వారి కోపాలు మరచిపోయి ఉద్రేకాలు తగ్గుతాయనే. రోజులు గడిచే కొద్దీ జరిగింది మరచిపోయి పట్టుదలలు పట్టకుండా వుండటానికి.

అలా ఏది జరిగినా జరిగింది మరచిపొమ్మని చెపుతారు. కారణం అన్నీ మామూలు స్థితికి వస్తాయని, అందుచేత ఆలోచించండి ఈ జన్మలో జరిగినవే మరచిపోవటానికి నానా తిప్పలు పడుతుంటే ఇది చాలదన్నట్టు గత జన్మలు చూసుకుని ఆ గతాన్ని కూడా గుర్తు తెచ్చుకుంటే ఇక వారి పరిస్థితి ఎలా వుంటుందో వూహించండి. ఇక వారు జీవించగలరా? ఆలోచించండి.

అంతేకాదు గత జన్మల స్పృహ అందరికీ వుంటే కనుక అంతా అస్తవ్యస్తమే, అన్నీ గొడవలే, అంతా అరాచకమే. ఎందుచేతనంటే ఎవరైనా గత జన్మ చూసుకున్నారనుకుందాం. ఒకవేళ ప్రస్తుతం వీరి భార్య గత జన్మలో వీరి తల్లి అని తెలిసిందనుకుందాం. అపుడు వీరి పరిస్థితి ఏమిటి? ప్రస్తుత భార్యతో కాపురం చెయ్యగలరా? అలాగే ఇంకొకరి కొడుకు గత జన్మలో వీరి బద్ధ శత్రువని తెలిసింది అపుడు వారిద్దరి పరిస్థితి ఎలా వుంటుంది? మరల కక్షలు తీర్చుకోవటానికి ప్రయత్నిస్తే ఆ సంసారం ఎలా వుంటుంది. అలాగే ఒకావిడ ప్రస్తుత భర్తే గత జన్మలో తన తండ్రి అని తెలిసిందనుకోండి అపుడు ఆమె భర్తతో కాపురం చెయ్యగలదా? చెప్పండి?

అలాగే పక్కింటి ఆయన భార్య గత జన్మలో తన భార్య అని తెలిసింది ఆవిడను రమ్మంటే వస్తుందా? ఇలా గత జన్మలలోని ఇలాంటి విషయాలు తెలిస్తే వారి పరిస్థితి ఏమిటి? అందుకే సృష్టిలో గత జన్మల మరుపు అన్నది ఇవ్వబడింది. ఈ మరుపు అన్నది మంచి కోసమే కానీ మరి దేనికి కాదు. ఈ విషయాలు మనకు తెలియక పోవచ్చు కానీ సృష్టి చేసిన వాడికి అంటే భగవంతునికి తెలుసు.

అంతేకాదు గత జన్మలోని మీ పిల్లలు, వారి వారసులు, సంసారం ప్రస్తుతం ఎక్కడెక్కడ వున్నారో తెలిసిందనుకోండి వారు చాలా ఇబ్బందులు పడుతున్నారనుకోండి వారందరినీ ప్రస్తుతం మీరు పోషించగలరా? మీ సంసారమే మీరు ఈదలేకపోతుంటే! వారందరినీ ఎలా పోషిస్తారు? అందుచేత గత జన్మలు తెలుసుకోవాలనే ఆతృత, సరదా మానండి.

ప్రస్తుతం గురించి, ప్రస్తుత జీవితం గురించి ప్రస్తుత జీవితంలో ఏం చేయాలో ఆలోచించండి. అయిపోయిన, జరిగి పోయిన వాటి గురించి ఆసక్తి

చూపకండి. ఏది ఏమైనా ఎప్పుడూ వర్తమానంలో జీవించటానికి ప్రయత్నించండి. అదే జ్ఞాని లక్షణం. అదే ఉత్తమమని తెలుసుకోండి.

ఎందుచేతనంటే కొంతమంది మనకు సలహా ఇవ్వవచ్చు. గత జన్మ చూసుకుంటే ప్రస్తుత మన సమస్యకు కారణం తెలుసుకోవచ్చు. తద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు అని చెపుతారు. కానీ పత్రీజీ మనకు చెప్పేదేమిటంటే ఏ సమస్యకైనా గత జన్మలలో మనం చేసిన కర్మలే కారణం. అందుచేత సమస్యలు పోవాలంటే కర్మలు పోవాలి. కర్మలు పోవాలంటే ధ్యానం చెయ్యాలి. అందుచేత ధ్యానం చెయ్యండి. కర్మలు పోతాయి. అన్ని సమస్యలు దానంతట అవే పోతాయి. దానికి గత జన్మ చూసుకోవలసిన అవసరం లేదు.

ఇంకా ఆలోచించండి ఒకవేళ మన గత జన్మ చూసుకుని ఒక సమస్య పరిష్కరించుకున్నామనుకోండి ఇక సమస్యలు రావా? అంటే జీవితంలో అలా వస్తూనే వుంటాయి. ఒక కష్టం తరువాత ఇంకొక కష్టం, ఒక సమస్య తరువాత ఇంకొక సమస్య. వీటికి అంతం ఎక్కడ? అంతేకాదు మనం గతంలో ఎన్నో జన్మలు ఎత్తి వుంటాం, ఏదో ఒక జన్మ చూసుకున్నంత మాత్రాన ఏం సరిపోతుంది? అవన్నీ సినిమా రీలులా ఎవరైనా మనకు చూపించగలరా? అది ఎవరికైనా సాధ్యమా?

అందుచేత ఏదో ఒక సమస్య కోసం గత జన్మ చూసుకోవడం కంటే అసలు సమస్యలకి కారణం తెలుసుకుని వాటి నుంచి శాశ్వతంగా బయటపడటానికి కృషి చెయ్యండి. అసలు సమస్యలు రాకుండా చేసుకోవడానికి ప్రయత్నించండి. సరదా కోసం లేనిపోని కొత్త సమస్యలు సృష్టించుకోకండి.

ఏది ఏమైనా గుర్తుంచుకోండి. మీ సాధన మీరు చేస్తుంటే, ఏదైనా అవసరమైతే మీ అంతట మీరే మీ గత జన్మలు చూసుకోగలుగుతారు. అలా చూసుకోగలిగారు అంటే అది అవసరమన్నమాట. ఒకవేళ గత జన్మలు మీరు చూడలేకపోతే అది మీకు అవసరం లేదని తెలుసుకోవాలి. ఎందుచేతనంటే ఈ సృష్టిలో "చేయవలసింది చేస్తే పొందవలసింది పొందుతారు". అందుచేత కోరవలసిన పని లేదు. ప్రయత్నించవలసిన పని లేదు. అందుచేత సరదా తీర్చుకోవడం కోసం ఖర్చు పెట్టే డబ్బు లోకకళ్యాణం కోసం ఖర్చు పెట్టండి. మీ జ్ఞానాల్ని వృద్ధి చేసుకోవడం కోసం కర్చు పెట్టండి. అలా చేస్తే లాభపడతారు కానీ సరదా కోసం కర్చు పెడితే ప్రయోజనమేముంటుంది?

అందుచేత గత జన్మలు చూసుకోవడానికి ఎగబడకండి. మీ సాధన మీరు చెయ్యండి. అవసరమైతే ఆటోమేటిక్‌గా మీరే చూసుకుంటారు. మీ జ్ఞాన పరిధి పెరిగినపుడు గత జన్మలు చూసుకున్నా ఫరవాలేదు.

అంతేకాదు కొంతమంది ధ్యానంలో ఏవో కొన్ని దృశ్యాలుచూసి, కొన్ని ప్రదేశాలు చూసి తమకు మూడవ కన్ను తెరచుకుందని పొంగిపోతారు. మేము "థర్డ్ ఐ మాస్టర్" అయిపోయామని గొప్పలు చెప్పుకుంటారు. తామేదో అందరి కంటే గొప్ప స్థితిలో వున్నట్టు భావిస్తారు. కానీ ఇది ప్రారంభ స్థితే కానీ పూర్ణ స్థితి కాదు. పూర్ణ స్థితికి చేరాలంటే ఇంకా ఎంతో సాధన చెయ్యాలి. ఎన్నో పరీక్షలనెదుర్కోవాలి.

ఎందుచేతనంటే ఏవో కొన్ని దృశ్యాలు కనబడగానే గొప్ప స్థితికి ఎదిగిపోయినట్టు ప్రతీచోటా నాకు అది కనిపించింది, నేను ఇది చూసాను అని గొప్పలు చెప్పుకుంటారు. తీరా ఇలాంటి అనుభవం ఎన్నాళ్ళు ధ్యానం చేస్తే వచ్చింది అంటే కొన్ని నెలలో, సంవత్సరాలో చెబుతారు.

కానీ మీరే కనుక ఒక ఎలిమెంటరీ స్కూలుకు వెళ్ళి అక్కడ వున్న పిల్లల చేత 15 నిమిషాలు ధ్యానం చేయించి వారి అనుభవాలు అడగండి వారంతా ఏదో ఒకటి చూసామని అంటే చెట్లని, కొండలని, సముద్రమని, రంగులని ఏదో ఒకటి చెబుతారు. ఇంకా మాకు సాయిబాబా కనిపించాడు. వెంకటేశ్వరస్వామి కనిపించాడు అని కూడా కొంతమంది చెబుతారు. అంటే పావుగంట ధ్యానం చేసిన పిల్లలంతా 'థర్డ్ ఐ మాస్టర్సే' కదా? అంటే సంవత్సరాలు చేసి సంపాదించిన అనుభవం పిల్లలు పావుగంటలో సంపాదించారు కదా? ఇంతకీ ఎవరు గొప్ప? చెప్పండి.

అందుచేత ఇటువంటి అనుభవాలు వస్తే గొప్ప స్థితికి ఎదిగినట్టు కాదు. అసలు ఇవేమీ ముఖ్యం కాదు. అసలు మీలో, మీ ప్రవర్తనలో ఎంత మార్పు వచ్చింది. మీ జ్ఞానం ఎంత పెరిగింది? అన్నదే ముఖ్యమని తెలుసుకోండి. నిజంగా జ్ఞానవంతులవుతే అసలు ఇలాంటి గొప్పలే చెప్పుకోరు.

అందుకే పత్రిగారు ముముక్షువుల యొక్క శత్రువులు అని చెపుతూ "సాధకులకు వచ్చే పరిమిత జ్ఞానాన్నే పరిపూర్ణ జ్ఞానమనుకునే" ప్రమాదం వుంది. ఇది పతనానికి దారి తీస్తుంది అని చెబుతారు.

అలాగే చాలా మంది "సూక్ష్మశరీర యానం" చెయ్యాలని సరదా పడుతూంటారు. ఎన్నాళ్ళు ధ్యానం చేసినా ఈ అనుభవం రాకపోయేసరికి నిరుత్సాహపడతారు. కానీ ఈ అనుభవం కూడా ప్రకృతిలో అవసరమైన వారికి, అవసరమైనపుడే కలుగుతుంది. అంతేకాని ఆశించినంత మాత్రాన, కోరుకున్నంత మాత్రాన ఈ అనుభవం రాదు. అసలు ఈ సూక్ష్మ శరీరయానం అన్నది ప్రతీ ఒక్కరికి రాత్రి నిద్ర సమయంలో జరుగుతూనే వుంటుంది. ఆ

అనుభవాలే కలల రూపంలో, మధ్య మధ్యలో కొన్ని విషయాలు స్ఫురణకు రావడం ద్వారా తెలుస్తూ వుంటుంది. కాస్త గమనించగలిగితే కొత్త విషయాలు కొన్ని ఈ రకంగానే తెలుస్తాయని అర్థమవుతుంది.

అందుచేత ఈ అనుభవం గురించి కూడా ఆశించవద్దు. ఆ అనుభవం రాకపోతే మీ సాధన తక్కువని భావించవద్దు. మీలో వచ్చే మార్పే, మీ ప్రవర్తనలో కలిగే మార్పే మీ సాధనకి కొలమానం అని తెలుసుకోండి.

అలాగే కొంతమంది ధ్యానంలో ఆయన కనిపించారు. ఈయన కనిపించారు. వారు నాకు మెస్సేజ్ ఇచ్చారని చెబుతూ వుంటారు. ఇలాంటి అనుభవాలకు కూడా పొంగి పోనవసరం లేదు. గొప్పగా చెప్పుకోనవసరం లేదు. ఏవైనా సందేశాలు వస్తే వాటిని గ్రహించి వాటిని ఆచరించే ప్రయత్నం చెయ్యండి చాలు.

ఇది అర్థం కాక కొంతమంది సలహా మేరకు చాలా మంది ధ్యానంలో "మాష్టర్స్"ను పిలవడం, వారిని ఆ ప్రశ్నలు, ఈ ప్రశ్నలు అడగడం చేస్తూంటారు. ఆ విషయాలను అందరికీ చెబుతూ వుంటారు. నేను పిలిస్తే ఆయన వచ్చాడు, ఈయన వచ్చాడు. ఆ మాష్టరు నాకు అది చెప్పాడు, ఇది చెప్పాడు అని అందరికీ చెపుతూ వుంటారు.

కానీ తెలుసుకోండి ఈ సృష్టిలో ప్రత్యేకించి ఏదీ అడగవలసిన పని లేదు, కోరవలసిన పని లేదు. "చేయవలసిన ధ్యాన సాధన చేస్తే పొందవలసిన అనుభవాలు, కావలసిన సందేశాలు దానంతట అవే వస్తాయని తెలుసుకోండి". అలా నిర్ణయం ప్రకృతికి వదలకుండా ఎప్పుడు పడితే అపుడు, ఎవరిని పడితే వారిని రావాలని, కనబడాలని, ఫలానా విషయం, సందేహం తీర్చాలని అడిగితే అంటే కోరితే, అలా జరిగినపుడు మీరు కష్టపడి సాధన చేసి సంపాదించుకున్న శక్తి అంతా కోల్పోతారని తెలుసుకోండి.

ఎందుచేతనంటే ఇలాంటి అనుభవాలు కొంతమందికే వస్తాయి. అందరికీ రావు. దానికి ముఖ్య కారణం అనుభవాలు వచ్చిన వారు సాధన ద్వారా సరిపడా శక్తి సంపాదించుకున్నారని అర్థం. మరి కొందరికి అలాంటి అనుభవం కలగలేదంటే వారికి సరిపడా శక్తి లేదనే అర్థం.

ఏది ఏమైనా నిర్ణయం ప్రకృతికి వదిలిపెట్టాలి. అలా కాకుండా మీరు ప్రత్యేకించి కోరితే దానికి మీరు కొంత మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. పురాణాలలోని విశ్వామిత్రుని కథ చూసాము కదా? అందుచేత సాధన చెయ్యండి. శక్తిని పెంచుకోండి. గుణాలు మార్చుకోండి. ప్రవర్తన మారిందా?

లేదా? చూసుకోండి. జ్ఞానం ఎంత వరకు పెరిగిందో చూసుకోండి. అంతేకాని నేనేం చెయ్యాలి? అదెందుకు జరుగుతుంది? ఇదెందుకు జరుగుతుంది? అంటూ వారి గురించి, వీరి గురించి, దాని గురించి, దీని గురించి అడిగితే కష్టపడి సాధన చేసి సంపాదించిన శక్తినంతా కోల్పోతారు. మరల మామూలు సామాన్య మనుష్యులై పోతారు.

నిజంగా మీకు తెలివితేటలుంటే మీకు ఏది కావాలన్నా! మీకు ఏది తెలియాలన్నా! మీరు ఏమి చెయ్యాలన్నా! అన్నీ మన పత్రిగారు పుస్తకాల ద్వారా, సందేశాల ద్వారా చెప్పనే చెప్పారు. అవన్నీ జాగ్రత్తగా చదివితే, అధ్యయనం చేస్తే మనకు తెలియనిదంటూ, మనం తెలుసుకోలేనిదంటూ ఏదీ వుండదు. అంత విపులంగా, వివరంగా పత్రిగారు అన్ని విషయాలు మనకు బోధించారు. తెలుసుకోండి పత్రి గారి పుస్తకాలు అధ్యయనం చేస్తే మీకు అన్ని విషయాలు తెలుస్తాయి. పత్రి గారి పుస్తకాలు చదవకుండా ఎవరి ద్వారానో తెలుసుకోవాలని ప్రయత్నిస్తే కనుక మీరు తెలుసుకోగలిగింది చాలా కొద్ది విషయాలే, పైగా మీ సాధనా శక్తినంతా కోల్పోవడం జరగుతుంది. కానీ పత్రిగారు మనం నష్టపోకుండా సమస్త జ్ఞానాన్ని మనకు అందించారు. అసలు పత్రీజీ భూమి మీద అవతరించిందే మనం నష్టపోకుండా మనకు అన్ని విషయాలు తెలియచేయటానికే. ఎందుచేతనంటే ఎవరు చెప్పినా, ఎంతమంది చెప్పినా 'సత్యం' ఒక్కటే. అదే 'సత్యాన్ని' పత్రీజీ వూరూరా, దేశదేశాలు తిరిగి బోధిస్తున్నారు, తెలియచేస్తున్నారు. అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. అహర్నిశలు శ్రమిస్తున్నారు. అసలు పత్రీజీ పుస్తకాలు అధ్యయనం చేస్తే నివృత్తి కాని సందేహమంటూ ఏదీ వుండదు. అన్ని సందేహాలు పటాపంచలవుతాయి. అసలు సృష్టిలోనే మనందరి కోసమే పత్రీజీ రావడం లాంటి ఏర్పాటు జరిగింది.

ఇది మనం అర్థం చేసుకుంటే ఏవో కొన్ని ప్రశ్నలు, కొన్ని సందేహాల కోసం మన విలువైన శక్తినంతా వృథా చేసుకోం.

అందుచేత ఇలాంటి వాటి వెనకాల పడకండి. అనుభవాల కోసం ఆరాటపడకండి. అలా వినటానికి, చూడటానికి సరదాగానే వుంటుంది. సరదా కోసం విలువైన శక్తిని నష్టపెట్టుకోకండి. నష్టపోయి సరదాలు తీర్చుకోకండి. శక్తి యొక్క గొప్పతనం తెలుసుకోండి. శక్తి యొక్క విలువ తెలుసుకోండి. శక్తి సంపాదించుకుని మీరు కూడా యోగులులా శక్తివంతులు కండి. శక్తిని పోగొట్టుకుని శక్తి హీనులవ్వకండి. మీ ముముక్షత్వాన్ని కోల్పోకండి. అందుకే పత్రీజీ "ముముక్షువు యొక్క శత్రువులు"అని తులసీదళంలో అద్భుతమైన

సందేశాన్ని ఇచ్చారు. వాటిని జాగ్రత్తగా అధ్యయనం చేసి వాటి నుంచి బయట పడండి.


అందుచేత మూడవ కన్ను తెరచుకుని ఏదైనా దృశ్యాలు చూసినా, సూక్ష్మ శరీరయానం చేసినా, ఎవరినైనా కలిసినా, ఏమైనా సందేశాలు వచ్చినా పొంగిపోనవసరం లేదు. ముందు మన ప్రవర్తన మారిందా? లేదా? జ్ఞానం పెరిగిందా? లేదా? అన్నది చూసుకోండి. ధ్యానం చేసే వారికి దివ్యానుభవాలు, అతీంద్రియ శక్తులు రావడం అన్నది సహజం. అందుచేత వాటి గురించి పొంగిపోవలసిన అవసరం లేదు. గొప్పగా చెప్పుకోనవసరం లేదు. గొప్పగా భావించనవసరం లేదు.

తెలుసుకోండి. **"చేయవలసింది ధ్యానం. పొందవలసింది జ్ఞానం",** ఇదే మానవ జీవిత లక్ష్యం. అదే పత్రీజీ బోధించేది కూడా. ఈ విషయం తెలుసుకుని ధ్యాన సాధన మీద దృష్టి వుంచండి. శక్తులు కోసం చూడకండి. అనుభవాల కోసం ప్రాకులాడకండి. సాధన వుంటే శక్తులతో పాటు అవసరమైనవన్నీ దానంతట అవే వస్తాయని తెలుసుకోండి. సాధన మీద దృష్టి వుంచండి.

మరొక్కసారి తెలుసుకోండి. **"శక్తులు సరదాలు తీర్చుకోవడానికి కాదు. జీవిత లక్ష్యాలు సాధించడానికి".** ప్రకృతిని తక్కువగా అంచనా వేయకండి. ప్రకృతి గురించి, ప్రకృతి శక్తి గురించి తెలుసుకోండి. ప్రకృతిని అనుసరించి జీవించండి.

మనమంతా ప్రకృతిలో జీవిస్తున్నామని గుర్తు చేసుకుంటూ వుండండి. ప్రకృతిచే గమనించబడుతున్నామని, మనం చేసే ప్రతీ పని, అనుక్షణం గమనించబడుతుందన్న సంగతి ఎప్పుడూ మరచిపోకండి. "మనం చేసే పనులను బట్టే ఫలితాలని తెలుసుకోండి". ప్రకృతి నియమాలు అనుసరించి జీవించండి. అందులోనూ ధ్యాన సాధనా మార్గంలోకి వచ్చిన వారు అంటే జిజ్ఞాసులు, ముముక్షువులు మరీ జాగ్రత్తగా వుండాలి.

బ్రహ్మర్షి పత్రీగారి సందేశాలు జాగ్రత్తగా అర్థం చేసుకోండి, అనుసరించండి. ధ్యానసాధనా మార్గంలో క్షణ, క్షణ జాగ్రత్త కలిగి వుండండి. జీవిత పరమార్థం తెలుసుకోండి. జీవిత లక్ష్యాన్ని సాధించండి. జీవితాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోండి. జీవితాన్ని ధన్యం చేసుకోండి.



# ముముక్షువు యొక్క శత్రువులు

నాలుగు రకాల శత్రువుల నుంచి ... **"ముముక్షువు"** అనబడేవాడు తనను తాను రక్షించుకోవాలి. అవి:

**1) భయం**
**2) పరిమిత జ్ఞానం**
**3) సిద్ధుల ద్వారా వచ్చే అహంకారం**
**4) వృద్ధత్వపు అలసత్వ భావనలు**

**1) "భయం"** అన్నది ముముక్షువు యొక్క మొదటి శత్రువు. ముముక్షువు ముందుగా అన్ని రకాలైన భయాలనూ జయించాలి. అప్పుడే "జ్ఞానం" అన్నది మొలకెత్తుతుంది.

అయితే ప్రాథమిక, పరిమిత జ్ఞానాన్నే "పూర్ణ జ్ఞానం" అనుకునే ప్రమాదం ఎప్పుడూ వుంటుంది.

**2) "పరిమిత జ్ఞానం"** అన్నదే ముముక్షువు యొక్క రెండవ శత్రువు ఆ గండం నుంచి తప్పించుకోగలిగితే సిద్ధులు సంక్రమిస్తాయి.

సిద్ధులు సంక్రమించి గర్వం సంభవిస్తే అది తిరిగి పతనానికి దారి తీస్తుంది. సిద్ధులను సంపాదించి తీరాలి.

అయితే గర్వం రాకుండా మనల్ని మనం కాపాడుకోవాలి.

**3) "సిద్ధుల ద్వారా వచ్చే అహంకారం"** అన్నదే ముముక్షువు యొక్క మూడవ శత్రువు.

అది జయించిన తర్వాత కూడా చిట్టచివరి వరకూ అలసటకు – అంటే "వృద్ధత్త్వపు అలసత్వ భావనలకు" ఎప్పుడూ లోను కారాదు.

**4) "వృద్ధత్వపు అలసత్వ భావన"** అనేది ముముక్షువు యొక్క అంతిమ శత్రువు.

▲ **భయం, పరిమిత జ్ఞానం, సిద్ధులు సృష్టించే అహంకారం, వృద్ధత్వపు అలసత్వ భావనలు ... ఈ శత్రువులను నాల్గింటినీ జయించాలి. ఎప్పటికప్పుడు ఈ శత్రవులు బారి నుంచి రక్షించుకుంటూ వుండాలి.**


# పురాణాలలో అతీంద్రియ శక్తులు గురించి...

అతీంద్రియ శక్తులు అన్నవి పూర్ణజ్ఞానం కాదు. పూర్ణ జ్ఞానం సంపాదించుకునే మార్గం మాత్రమే అని తెలుసుకోవాలి. అందుచేత లక్ష్యం పూర్ణజ్ఞానం మీదనే వుంచాలి. అతీంద్రియ శక్తులు చూసుకునిగర్వించి పతనమైన వారు పురాణాలలో ఎంతో మంది కనిపిస్తారు. అలాగే అతీంద్రియశక్తులు, సిద్ధులు కలిగినా వాటి గురించి ఆలోచించకుండా ఏమీ లేనట్లుగా ప్రవర్తించి పూర్ణజ్ఞానిగా మారిన వారు మనకు పురాణాలలో కనిపిస్తారు.

అందుచేత పై విషయాల గురించి పురాణాలలోని కొన్ని సన్నివేశాలు తెలుసుకుందాం. ముఖ్యంగా రామాయణంలో నుంచి తెలుసుకుందాం.

రామాయణంలో వానరరాజు, వీరుడు 'వాలి' అపార బల సంపన్నుడు, సిద్ధి కలిగిన వాడు. ఆయనకు ఎదుట వారిలో వున్న బలాన్ని హరించి వేసే అంటే లాక్కునే శక్తి అంటే సిద్ధి వుంది. అందుకే శ్రీరాముడు చెట్టు చాటు నుండి చంపవలసి వచ్చింది.


అంతటి బల సంపన్నుడు, సిద్ధి కలిగిన 'వాలి' గర్వంతో, అహంకారంతో తమ్ముడు సుగ్రీవుని తరిమేసి అతని భార్యను చెరపట్టాడు. అంటే స్త్రీ లోలుడయ్యాడు. 'కామానికి' వశుడయ్యాడు. అక్రమంగా ప్రవర్తించాడు. సృష్టి విరుద్ధంగా ప్రవర్తించాడు. చివరకు శ్రీరాముని చేతిలో హతమయ్యాడు. అంటే నాశనమయ్యాడు. దీనిని బట్టి సిద్ధులున్నాయని గర్విస్తూ వాటిని ఉపయోగించి చేయకూడని పనులు చేస్తే ఎవరైనా సరే నాశనమవుతారని రామాయణంలోని ఈ సన్నివేశాన్ని బట్టి మనం తెలుసుకోవచ్చు.



అలాగే రామాయణంలో ఒక ముఖ్యపాత్ర అయినటువంటి

ఆంజనేయస్వామికి కూడా ఎన్నో సిద్ధులు వున్నాయి. కానీ ఆయన వాటిని చూసుకుని గర్వించలేదు. అహంకారంతో ప్రవర్తించలేదు. ఎన్ని సిద్ధులు వున్నా ఏమీ లేనట్టుగా ప్రవర్తించేవాడు. ఆయన ఎలా వుండేవాడంటే ఆయన శక్తి ఆయనకు ఇంకొకరు గుర్తు చేయవలసి వచ్చేది. ఆయన వాటిని చూసుకుని గర్వించలేదు, ఉన్నాయని గొప్పలు చెప్పుకోలేదు. అంటే ఆయనకు అన్నీ వున్నా ఏమీ లేనట్టుగా ప్రవర్తించేవాడు. వున్నదాని కంటే ఎక్కువగా చెప్పుకుంటున్నారు. కానీ ప్రస్తుతం ఏమీ లేకపోయినా వున్నట్టుగా గొప్పలు చెప్పుకుంటున్నారు.

రామాయణంలోని ఒక సన్నివేశం ద్వారా మనం యీ విషయం తెలుసుకోవచ్చు. సీతాన్వేషణ కోసం లంకకు చేరాలంటే సముద్రాన్ని 100 యోజనాలు లఘించాల్సి వుంది. అంటే దాటవలసివుంది. అక్కడ వున్న వానరవీరులందరూ 10, 20, 30, 50 అలా కొన్ని యోజనాలే లంఘించగల శక్తి వున్నవారే కానీ 100 యోజనాలు లఘించగల వారు ఎవ్వరూ లేరు. అలా ఎవరికి వారు తాము దూకగలిగే శక్తిని చెప్పుకుంటున్నారు. కానీ ఆంజనేయస్వామి ఏమీ చేయలేనట్టు, ఒక ప్రక్కన కూర్చున్నాడు. అప్పుడు జాంబవంతుడు ఆంజనేయుని సమీపించి ఏమిటి? నువ్వు అలా ఏమీ చేయలేని వాడిలా అలా కూర్చున్నావు. ఆ పనిని నీవు చేయగలవు. ఆ కార్యం నువ్వు సాధించగలవు అని చెప్పగానే హనుమంతుడు ఆ కార్యం చేయడానికి



సిద్ధపడ్డాడు. ఆ కార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి రాగలిగాడు.

దీనిని బట్టి సిద్ధులు వున్నా లేనట్టుగా ప్రవర్తించాలని, గర్వంతో విర్రవీగ కూడదని, అటువంటి శక్తులతో లోకకళ్యాణకరమైన పనులు చెయ్యాలని మనం తెలుసుకోవాలి.

అంతే కాదు మనం ఇంకా తెలుసుకోవలసింది ఏమిటంటే

ఆంజనేయస్వామికి ఎన్ని సిద్ధులు వున్నా, ఎన్ని శక్తులు ప్రదర్శించగలిగినా; గొప్ప కార్యాలు చేసినా, ఆయనకు ఆత్మజ్ఞానం కలుగలేదు. ఆత్మతత్వం అర్థం కాలేదు. ఆత్మానుభవం పొందలేదు. ఆ 'ఆత్మ'ను అంటే ఆత్మారాముని దర్శించటానికి ఆయన ఎంతో తపన పడ్డాడు. ఎంతో ఆవేదన చెందాడు. శ్రీరామ పట్టాభిషేకం జరిగిన తరువాత ఆవేదనతో ముత్యాలహారంలోని ముత్యాలు అన్నీ కొరికి చూసాడు కానీ ఆత్మారాముడు కనిపించలేదు.

ఆంజనేయస్వామి అలా చేస్తుంటే ఆంజనేయస్వామి ఆత్మానుభవం



పొందాలనే తపనతో వున్నాడని తెలుసుకున్న శ్రీరామచంద్రుడు ఆంజనేయస్వామిని తన మందిరానికి రమ్మనమని పిలిచి, ఆత్మజ్ఞానాన్ని బోధించాడు. బోధించిన తర్వాత శ్రీరాముడు ఆంజనేయస్వామిని అడిగాడు. ఇపుడు నీకు ఆత్మజ్ఞానం కలిగిందా? ఆత్మ తత్వం అర్థమైందా? అంటే ఆంజనేయ స్వామి అర్థమయ్యింది అన్నాడు. వివరించమని శ్రీరాముడు అనగానే ఆంజనేయస్వామి ఈ విధంగా మూడు మాటల్లో ఆత్మతత్వాన్ని వివరించాడు.

**"నేను దేహ స్థితిలో వున్నపుడు నీకు బంటుననుకున్నాను. అంటే నీవు నేను వేరు అనుకున్నాను. మనో స్థితిలో వున్నప్పుడు నీవు నాలో వున్నావనుకున్నాను. కానీ ఆత్మ స్థితిలో నీవు, నేను ఒక్కటే అని తెలుసుకున్నాను"** అని చెప్పగా శ్రీరాముడు నీవు ఆత్మజ్ఞానివి అయ్యావు అని ప్రశంసించడం జరిగింది.

పై విషయాలను బట్టి సిద్ధులు, శక్తులు అన్నవి పరిపూర్ణ స్థితి కాదని తెలుస్తుంది. ఆత్మజ్ఞానమే అన్నిటికంటే పూర్ణ స్థితి అని మనకు అర్థమవుతుంది. అందుచేత ధ్యానం చేసేవారు అనుభవాలు, శక్తులు పొందామా? లేదా? అని చూడకూడదు, అసలు వాటికి ప్రాముఖ్యం ఇవ్వనవసరం లేదు. ఒకవేళ కలిగినా ఆంజనేయస్వామిలా లేనట్టుగా వుండేవాడే గొప్పవాడు అని తెలుసుకోవాలి.

కానీ ప్రస్తుతం ధ్యానం చెయ్యడం, ధ్యానం చెప్పడం, ధ్యాన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం ఎందుకు చేస్తున్నారంటే తమ ప్రాపంచిక సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రాపంచిక కోరికలు, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు తీరతాయని, జీవితం ఆటంకాలు, అవరోధాలు లేకుండా సాఫీగా

సాగిపోతుందని, ఏవేవో అనుభవాలు కలుగుతాయనే ఉద్దేశ్యంతో పై కార్యక్రమాలు సాధన చేస్తున్నారు. అలా చేస్తూ ఒకవేళ కొద్దిపాటి అనుభవాలు కలిగినా, నాకు అనుభవాలు కలిగాయని, లాభాలు వచ్చాయని అందరికీ గొప్పగా చెప్పుకుంటున్నారు తప్ప జ్ఞానం పెంచుకోవడానికి, జ్ఞానం పెరిగిందా? లేదా? అన్న దాని మీద ఎవరూ దృష్టి వుంచడం లేదు. ధ్యానం... జ్ఞానం కోసమన్న అవగాహనే ఎవరికీ లేదు.

అలాగే శ్రీ ఆది శంకరాచార్యుల వారు తన పర్యటనలో ఒక సిద్ధుడిని కలవడం, ఆయన నుంచి అనేక సిద్ధులు కూడా నేర్చుకోవడం జరిగింది. ఆయన నుంచి పరకాయప్రవేశం లాంటి విద్యలు కూడా నేర్చుకున్నారు.

ఆ సందర్భంలో ఆ సిద్ధుడు చెప్పినదేమిటంటే అన్ని రకాలుగా అన్నీ వున్న నేను ఈ ప్రజల మూర్ఖత్వం, అజ్ఞానం చూసి, వారు చేసే పనులు చూసి కలత చెంది, అన్నీ వదిలి పెట్టి కఠోర సాధనలు చేసి ఇలా సిద్ధులు సంపాదించాను. ఈ సిద్ధులు, శక్తులు ఉపయోగించి ప్రజలను మార్చాలనుకున్నాను. జ్ఞానవంతుల్ని చెయ్యాలనుకున్నాను కానీ నాకు సాధ్యం కాలేదు. అది జ్ఞానివైన నీవల్లే అవుతుందని చెప్పడం జరిగింది. ఆయన అన్ని రకాల సిద్ధులు, శక్తులు వున్నా కూడా తన అసక్తతను అంగీకరించాడు.

దీనిని బట్టి సిద్ధులు, శక్తులు పరిపూర్ణ జ్ఞానానికి సంకేతం కాదు. అవి జ్ఞానం పొందటానికి సహకరిస్తాయి. పూర్ణజ్ఞానం పొందటానికి ఎంతో ఉపయోగపడతాయి. తప్ప వాటితో పూర్ణ జ్ఞాని అయినట్టు కాదని తెలుసుకోవాలి. అంతేకాదు లోకాన్ని, లోకులను జ్ఞానవంతులను చెయ్యాలి అంటే సిద్ధులు, శక్తులు సరిపోవు. దానికి జ్ఞానమే కావాలి. జ్ఞానే జ్ఞానాన్ని బోధించగలడు కానీ, శక్తులు వున్నవాడు కాదని అర్థం చేసుకోవచ్చు. సిద్ధులు, శక్తులన్నవి జ్ఞానం పొందటానికి ముందు స్థితి మాత్రమే తప్ప, పరిపూర్ణ స్థితి మాత్రం కాదు. అవి ప్రదర్శించినంత మాత్రాన గొప్పవాడైనట్టు కాదని అర్థం చేసుకోవాలి.

అందుచేత జ్ఞానం యొక్క గొప్పతనం తెలుసుకోండి, జ్ఞానం యొక్క ఆవశ్యకతను అర్థం చేసుకోండి. జ్ఞానాన్ని పెంచుకోండి. జ్ఞానవంతులవ్వండి. వూరికే అనుభవాల కోసం ఆరాట పడకండి. వాటిని చూసి మురిసిపోకండి. అవి వున్న వారిని చూసి గొప్పగా భావించకండి. చేయవలసిందేమిటో తెలుసుకుని పొందవలసిందేమిటో తెలుసుకోండి. మరొక్కసారి తెలుసుకోండి. **"చేయవలసింది ధ్యానం. పొందవలసింది జ్ఞానం". కారణం "ధ్యానం వల్లనే జ్ఞానం... జ్ఞానం వల్లనే ముక్తి".**

# చావు - నిద్ర - ధ్యానం

**"చావు" ... "నిద్ర" .. "ధ్యానం"**

ఇవన్నీ కూడా దగ్గర దగ్గరగా ఒక్కలాంటివే

ఇవన్నీ కూడా

మన స్థూల శరీరాన్ని మనం వదిలే చర్యలే
శాశ్వతంగానో, అశాశ్వతంగానో

మరి పూర్తిగానో, కొద్దిగానో... మరి తెలిసో, తెలియకో

**"చావు"** లో మనం శాశ్వతంగా శరీరాన్ని వదలివేస్తాం

**"నిద్ర"** లో మనకు తెలియకుండా శరీరం నుంచి బయటకు

వచ్చి కొన్ని గంటల తరువాత తెలియకుండానే తిరిగి శరీర ప్రవేశం చేస్తాం

**"ధ్యానం"** యొక్క పరాకాష్టలో మనం పూర్తి ఎరుకతో శరీరం వదిలి

సూక్ష్మదేహయాత్రల తరువాత పూర్తి జ్ఞానంతో

తిరిగి స్థూలదేహ ప్రవేశం చేస్తాం

- ▲ **ధ్యానం వలన నిద్రావస్థలో చేసే యాత్రలు అధికంగా జ్ఞాపకం వుంటాయి**


- ▲ **అంతేకాకుండా ఆ యాత్రలు ఎక్కువ ఉపయోగకారిగా కూడా వుంటాయి.**

- ▲ **ధ్యానం ద్వారా మరణాంతర జీవితం గురించి మనకు పూర్తిగా అర్థం అవుతూ వుంటుంది**

# అనుబంధము

# అంతరార్థాలు

## బ్రహ్మర్షి పత్రీజీ



# మాయ

**“మాయ”**

అనే పదానికి నిర్వచనం

**“యా మా, సా మాయా”**

“యా” = ఏదైతే ... “మా” = లేదో

“సా” = అది (దానిని) “మాయా” = మాయ (అని అంటారు)

అంటే

“ఏదైతే లేదో”, అంటే “దేనికైతే అస్తికత లేదో”

దానికి **“మాయ”** అని పేరు

నిజానికి

ప్రపంచంలో రెండే రెండు వస్తువులు **“మాయ”**

ఒకటి – **“చావు”** అనే భావన

రెండు – **“నేను వేరే, నువ్వు వేరే”** అనే భావన

**“చావు”** అన్నది అసలు ఎక్కడా లేదు!

ఉన్నదల్లా ఆది, అంతం లేని రూపాంతరీకరణ పరిణామక్రమమే!

“ఎక్కడా చావు లేదు” అని తెలుసుకున్నవాడే

‘మాయ’ లోంచి బయటపడినవాడు

అలాగే “అహం బ్రహ్మాస్మి” .. “తత్త్వమసి”

అంటే “నేనూ అదే... నువ్వూ అదే”..

“మమాత్మా సర్వభూతాత్మా” అని తెలుసుకున్నవాడే

‘మాయ’ లోంచి బయటపడినవాడు !

“దేహాత్మ భ్రాంతి” ఉన్నవాడే “మాయ”లో చిక్కినవాడు

“ఆత్మే దేహం” అన్న జ్ఞానం వున్నవాడే “మాయ” లేనివాడు

- **ధ్యానం ద్వారానే దేహాత్మ భ్రాంతి తొలగుతుంది.**
- **ధ్యానం ద్వారానే “మమాత్మా సర్వభూతాత్మా” అని తెలుసుకుంటాం.**

# దత్తాత్రేయ

**"ముని" అంటే "మౌని"**

"వాక్ మౌనం ఉన్నవాడు" అన్నమాట

**"మహా ముని"** అంటే **"మహా మౌనం ఉన్నవాడు"** అన్నమాట

"చిత్తం వృత్తి రహితమైనవాడు" అన్నమాట

"త్రిగుణాలలో మునిగి తేలే త్రిగుణాత్మకులు"

తమకన్నా ఎక్కువగా కండబలం, దేహ సౌందర్యం, అధికారాలు

పదవులు, చదువులు, సంస్కారాలు ఉన్నవారి పట్ల అసూయతో

అసూయా ద్వేషాలతో వుండడం సర్వసామాన్యం

ఆ విధంగా ఎంతో ఆత్మపరంగా వున్నప్పుడు కూడా

ఒక్కోసారి అసూయ ఉండవచ్చు

విశ్వామిత్రుడికి ఉన్నట్టుగా – "నేను 'రాజర్షి'ని మాత్రమే

మరొకరు 'బ్రహ్మర్షి' " అని

మనిషికి చివరగా ఈ **"ఆధ్యాత్మిక అసూయ"** కూడా ఉండరాదు

అంటే, "మహాముని"గా అయినా "అనసూయ"తో కాపురం చేయాల్సిందే!

అసూయ లేని స్థితే 'అనసూయ' స్థితి

అప్పుడే, అంతా **దత్తం** అవుతుంది .. సిద్ధులన్నీ వస్తాయి

అలా అష్టసిద్ధులు అన్నీ 'దత్త' మైన స్థితే "దత్తాత్రేయ" స్థితి

**దత్త + అత్రి = దత్తాత్రేయ**

"అ+త్రి" = "అత్రి" = త్రిగుణాలను దాటినవాడు"

" 'అత్రి' కాని వాళ్ళు " = త్రిగుణాత్మకులు

"ఆ సత్యంలో, ఆ ధర్మంలో వుండటం" అంటే

'అనసూయతో సంసారం చేయడం "

"అప్పుడు మీ దగ్గరికే అన్నీ చేర్చబడతాయి"

అంటే "దత్తాత్రేయ స్థితి" అన్నమాట.

▲ **త్రిగుణాలు దాటి, నిర్గుణంలో విరాజిల్లుతూ "సదా అనసూయా స్థితి"లో స్థితమైనప్పుడే సర్వసిద్ధులూ దత్తమవుతాయి.**

# ఏడుకొండలవాడు

వేంకటేశ్వరస్వామి
అంటే, **“ఏడుకొండలవాడు”**

“ఏడుకొండలు దాటి వెళ్ళాలి” కనుక “ఏడుకొండలవాడు”
అని లోకులు సాధారణంగా అనుకుంటూంటారు.

అయితే
**“ఏడుకొండలు”** అన్నవి ఏడు శరీరాలనూ
**“షట్ చక్రాలనూ, మరి సహస్రారాన్నీ”** కలిపి” సూచిస్తాయి

కనుక
తన ఆరు చక్రాలనూ, మరి సహస్రారాన్నీ పూర్తిగా స్వాధీనం చేసుకుని
తన ఏడు శరీరాలనూ పరిపూర్ణంగా ఉత్తేజితం చేసుకున్నవాడినే
**“ఏడుకొండలవాడు”** అంటాం

ప్రతి పరమగురువూ ఏడుకొండలవాడే ..
ప్రతి ధ్యానీ చివరికి అయ్యేది ఓ “ఏడుకొండలవాడు” గానే !

▲ **1500 సంవత్సరాలుగా యోగ స్థితిలో వుంటూ
ఇప్పటికీ తిరుమల కొండల్లో మన మధ్య భౌతిక శరీరధారియై వుండి
మార్గదర్శియై, మనల్ని అందరినీ ఎంతగానో అలరారిస్తున్న
ఓ మహాయోగిపుంగవుడే ఓ ఏడుకొండలవాడే శ్రీ వేంకటేశ్వరస్వామి**

# పుత్రుడు - పున్నామనరకం

"పున్నామనరకం"
"పున్ + నామ + నరకం" అంటే
"మళ్ళీ మళ్ళీ 'నామం' తీసుకునే 'నరకం' "

అంటే "పునర్జన్మ" అన్నమాట

**"పుత్రుడు"** అంటే **"వారసుడు"**
మన గుణగణాలను సంతరించుకున్నవాడు
మనకున్న జ్ఞానాన్ని పోలి వున్న చతురతను గ్రహించినవాడు కనుక
"పుత్రుడు మనల్ని 'పున్నామ నరకం' నుంచి తప్పిస్తాడు" అంటే
"మన ఆత్మశిష్యుల ద్వారానే మనకు జన్మరాహిత్య పదవి వస్తుంది" అన్నమాట
'పుత్రుడు' అంటే శారీరక వారసుడు కాదు, బుద్ధిపరమైన వారసుడు

▲ **మనలాంటి ఆత్మజ్ఞానులను కొంతమందినైనా తయారు చేస్తేనే మనకు మరుజన్మ నుంచి మరి విడుదల**

# అశోక వనం

"సీతాదేవి అశోకవనంలో, అశోకవృక్షం క్రింద వలవలా ఏడ్చింది"
ఇది నిజమేనా? కాదు !
ఇందులో వాల్మీకి మహర్షి యొక్క కవితా చాతుర్యం వుంది
పామరులకు సంకేతంగా
"భర్త ఎడబాటు అయింది కనుక, వలవలా ఏడ్చింది" అన్నాడు.
అయితే <u>సీతాదేవి</u> మహాజ్ఞానురాలు, మహాయోగిని
ఆవిడకు 'శోకం' అన్నదే అసంభవం
కనుక, "అశోక వనం" అన్నాడు ... "అశోక వృక్షం" అన్నాడు.
"అశోకం" = "అ+శోక"
"ఎక్కడ శోకం లేదో అక్కడ" అన్నమాట

▲ **కనుక, "సీతాదేవి 'శోకగ్రస్తం' అయింది" అన్నది నిజానికి అవాస్తవం**

# నాలుగు యోగాలు

"చతుర్ముఖేన బ్రహ్మః" అన్నారు

అంటే "బ్రహ్మకు నాలుగు ముఖాలు వున్నాయి" అని
**"అహం బ్రహ్మాస్మి"** అంటే **'నేను' అన్నదే 'బ్రహ్మ'** "

మహాభారతంలో
**"దుష్టచతుష్టయం"** అన్నది
**"మనోబుద్ధిచిత్తాహంకారాలు"** అనే చతుర్ముఖాలను సూచిస్తుంది

| | |
|---|---|
| మనస్సు | = దుశ్శాసనుడు |
| బుద్ధి | = కర్ణుడు |
| చిత్తం | = శకుని |
| అహంకారం | = దుర్యోధనుడు |

అలాగే, మహాభారతంలో కృష్ణుడు అన్న పదం "బ్రహ్మ"కు సూచిక
బ్రహ్మ యొక్క "చతుర్ముఖాల" ద్వారా నాలుగు యోగాలూ సూచించబడ్డాయి

▲ **భక్తియోగం : అహంకారాన్ని .. అంటే 'నేను', 'నాది' అనే భావాలను పూర్తిగా తుడిచి పెట్టడం.**

▲ **కర్మయోగం : సంకల్ప వికల్పాలను కర్మాత్మకంగా సరి చేసుకుంటూ మనస్సును పరిశుద్ధం చేసుకోవడం**

▲ **జ్ఞానయోగం : బుద్ధిని సునిశితం చేయడం, అంటే నిత్యానిత్య విచక్షణా జ్ఞానాన్ని పెంపొందించుకోవడం**

▲ **రాజయోగం : చిత్తవృత్తులను నిరోధించి, సమాధి ప్రజ్ఞను పొందడం.**

# చిత్రగుప్తుడు

వాస్తవానికి ది **"గుప్త - చిత్రం"**

గుప్త = రహస్యమైన
చిత్రం = చిట్టా, రికార్డులు

**"గుప్త చిత్రం"** అంటే, "రహస్యమైన చరిత్రలు" అన్నమాట
**"గుప్త చిత్రం"** అంటే, **"ఆకాశిక్ రికార్డులు"** అన్నమాట

ప్రపంచంలో ప్రతీదీ సహజంగానే
అనంతపు ఆకాశతత్వంలో లిఖితం, చిత్రీకరణం అయిపోతూ వుంటుంది
దివ్యదృష్టితో ఈ చిత్రపటాలను చూసి, భూత
వర్తమానాల గురించి వున్నది వున్నట్లు గానూ
భవిష్యత్ గురించి చూచాయగా, ఎంచక్కా, తెలుసుకోవచ్చు

**శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి** ధ్యానంలో ఈ గుప్త చిత్రాలను
చూసే **"కాలజ్ఞానం"** వ్రాయగలిగారు
అలాగే ఫ్రాన్స్ దేశానికి చెందిన **నోస్ట్రడామస్** కూడా

▲ **ప్రతి యోగీ తన దివ్యచక్షువును ఉపయోగించుకుంటూ**
**ఈ గుప్త చిత్రాల ద్వారా అవసరమైనది తెలుసుకుంటూ వుంటాడు**

# గరళకంఠుడు

ఈ ప్రపంచంలో అందరి దగ్గరగా వున్న మిడిమిడి జ్ఞానం వల్ల
మనుష్యులు విషాన్ని సదా క్రక్కుతూ ఉంటారు
దుష్ట భావనలను ఉత్పత్తి చేస్తూ ఉంటారు
మరి దీనినే "నకారాత్మకత" అంటాం
"నెగెటివిటీ" అన్నదే "విషం"
మనం దానిని మింగకుండా, మన 'కంఠం'లోనే పెట్టుకోవాలి
అంటే, **"విశుద్ధ చక్రం"** లోనే పెట్టుకుని శుద్ధి చేయాలి
అలా చేసేవాడే "గరళ కంఠుడు"

గరళం = విషయం
కంఠుడు = కంఠంలో ధరించినవాడు

శ్రీ రత్నాకరం బాలరాజు గారు
**"ధమ్మపదం"** అన్న పుస్తకంలో చక్కగా చెప్పారు :

"చంద్రుణ్ణీ హాలాహల విషాన్నీ, ఈశ్వరుడు గ్రహించినట్లు
పండితుడు అందరి గుణాలనూ శిరసా శ్లాఘించి
దోషాలను మటుకు కంఠమందే నిల్పుకుంటాడు
.. బహిర్గత మొనరింపడు" అని

▲ **"గరళకంఠులు" కానిదే ఎవ్వరూ**
**ఎప్పటికీ ఆధ్యాత్మిక విజ్ఞానులుగా విరాజిల్లజాలరు.**

# త్రిపుర సుందరి

**"త్రిపుర సుందరి"** అంటే
"దేవతామూర్తి" కాదు ... **"ఆత్మ పదార్థం"**

త్రి = మూడు
పుర = పురాలలో ఉన్న
సుందరి = సుందరమైనది

మూలచైతన్యమే సుందరమైనది – ఇదే అసలు "సుందరి"
అయితే
ఈ మూల చైతన్యం ప్రకృతి తత్త్వాలతో తాదాత్మ్యం చెందుతూ
క్రమక్రమంగా మూడు తొడుగులను సంతరించుకుంటుంది

**కారణశరీరం .. సూక్ష్మశరీరం .. స్థూలశరీరం**
ఈ మూడు శరీరాలే "మూడు తొడుగులు" .. "మూడు పురాలు"
**ఆత్మపదార్థం** అన్నదే ఈ పాంచ భౌతిక లోకానికి వచ్చేసరికి
**"త్రిపుర సుందరి"** లా వెలుగుతోంది

**"త్రిపుర సుందరి"** ని "బాల" అని కూడా అభివర్ణిస్తారు
**"బాల"** అంటే నిత్య నూతనమైనది ..
నిత్య యవ్వనమైనది .. నిత్య శోభాయమానమైనది
ఈ లక్షణాలు అన్నీ ఆత్మతత్త్వం యొక్క గుణగణాలను సూచిస్తాయి

అందుకే, **శ్రీ త్యాగరాజు** ఇలా గానం చేశారు
"దారిని తెలుసుకొంటి – త్రిపుర సుందరిని తెలుసుకొంటి" అని

▲ **ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడానికి ఉన్నది ఒకే దారి**
**అదే "ఆనాపానసతి ధ్యానం"**

# శివుడు - మూడవ కన్ను

శివుడికి **"మూడవ కన్ను"** ఉంటుందట
**"మూడవ కన్ను"** తెరిస్తే అంతా భస్మమవుతుందట
నిజమే !
**"శివ"** అనే పదానికి **"ఆనందం"** అని ఒక అర్థం
**"మంగళకరం"** అనే మరో అర్థం కూడా ఉంది
కనుక, **"శివుడు"** అంటే "ఆనందమయుడు" అని
"మంగళకర జీవితం జీవిస్తున్నవాడు" అని
అయితే, ఈ **"శివ పదవి"** ఎలా సాధ్యం?

ఎవరైతే తమ తమ "మూడవ కన్ను"ను
అంటే **"ఆత్మచక్షువు"** ను
అంటే, "అతీంద్రియ శక్తులను" ఉత్తేజపరచుకుంటారో
వారందరూ శివుళ్ళే అవుతారు
"మూడవ కన్ను" ఉన్న ప్రతి మనిషీ **"శివుడు"** అనబడతాడు
ఎప్పుడైతే మన దివ్యచక్షువు సంపూర్ణంగా విచ్చుకుంటుందో
అప్పుడే మన అజ్ఞానం భస్మమవుతుంది
అప్పుడే, మన వికృతి వికారాలు భస్మమయి అన్నీ అంతమవుతాయి

▲ **ధ్యానం ద్వారానే "మూడవ కన్ను" ఉత్తేజితమయి**
**"శివ పదవి" లభ్యమవుతుంది**

▲ **"మూడవ కన్ను" ఉత్తేజితమయితే**
**ఇక "మాయ" అంతా భస్మమవుతుంది**

# కృష్ణ

చేయవలసినదాన్నంతా చేసి
అనుభవించవలసినదాన్నంతా అనుభవిస్తున్నవాడే **"కృష్ణుడు"**

తెలుసుకోవలసినదాన్నంతా తెలుసుకుని
పొందవలసిన ఫలాలను హాయిగా అనుభవిస్తున్నవాడే
ఏ **"కృష్ణుడు"** అయినా ..

"కృ" = చేయటం
"ష్ణ" = తినటం

ఏమిటి చెయ్యాలి?
మనల్ని మనం తెలుసుకోవడం చెయ్యాలి!
తనను తాను పూర్ణంగా తెలుసుకున్నవాడే **"కృష్ణుడు"**
తనను తాను సంపూర్ణంగా తెలుసుకున్నవాడే **"పురుషోత్తముడు"**
తనను తాను ఆత్మగా తెలుసుకున్నవాడే **"నారాయణుడు"**

చేయవలసినవి చేస్తేనే
పొందవలసినవి పొందుతాం
చేయకూడనివి చేస్తే
పొందకూడనివి పొందుతాం
చేసుకున్నవాడికి చేసుకున్నంత మహదేవా!

▲ **ఒకానొక దేవకీపుత్రుడు "కృష్ణుడు" అయ్యాడు**
**ఇక మనమంతా కూడా "కృష్ణులు"గా కావాలి.**

# దశరథుడు - అయోధ్య

**"అయోధ్య"** = "అ" + "యోధ్య"
"యోధ్య" అంటే "జయింపబడేది"
"అయోధ్య" అంటే "ఎంత యుద్ధం చేసినా జయింపలేనిది"
కనుక
"అయోధ్య" అంటే
ఈ "భౌతిక శరీరం" అన్నమాట

| | | |
|---|---|---|
| దశ | = | పది |
| రథుడు | = | రథాలు కలిగినవాడు |

"దశరథాలు" అంటే
"ఐదు జ్ఞానేంద్రియాలు .. ఐదు కర్మేంద్రియాలు"
**"దశరథుడు"** అంటే
**"దశేంద్రియాలతో కూడుకున్న జీవాత్మ"** అన్నమాట
"దశరథుడు అయోధ్యను పరిపాలిస్తున్నాడు" అంటే
"జీవాత్మ ఈ దశేంద్రియాలతో కూడి భౌతిక శరీరంలో నివసిస్తోంది"
అని అర్థం.

▲ **శరీరం అయోధ్య ... జీవుడు దశరథుడు ..
ఇదే వాల్మీకి మహర్షి "శ్రీ మద్ రామాయణం"
ద్వారా అందించిన సందేశం.**

# ఇంద్రుడు - ఐరావతం - వజ్రాయుధం

ఇంద్రియాలను జయించిన వాడే
**"ఇంద్రుడు"**
**"ఐరావతం"** అన్నది ఇంద్రుని వాహనం
అది తెల్లని ఏనుగు
ఏనుగు సాత్వికరూపం
తెలుపు రంగు శుద్ధతను సూచిస్తుంది
అందుకే
"ఐరావతం" అంటే "శుద్ధసత్త్వం"

శుద్ధ సత్వాన్ని సంతరించుకున్నవాడే
ఇంద్రియాలను జయిస్తాడు

మహామహులైన యోగులందరూ ఇంద్రులే
అటువంటి వారి మాటలకూ, చేష్టలకూ తిరుగు వుండదు
ఆ స్థితినే "ఒక మాట, ఒక బాణం" అన్నారు
అందుకే
"ఇంద్రుని" ఆయుధం "వజ్రాయుధం"

▲ **"తపస్సు" అంటే తీవ్రతర ధ్యానం ...**
**ధ్యానం ద్వారానే 'ఇంద్రస్థితి' వచ్చేది**
**మన అందరి ధ్యేయం 'ఇంద్రులు'గా కావడమే.**

# అహమేవ శరణం మమ

“భక్తియోగం”లో
మామూలుగా మనం వింటూ వుంటాం
“త్వమేవ శరణం మమ” అని

అంటే
“నీవే నాకు దిక్కు” అని

ఈ స్థితి మనలను నిర్వీర్యులుగా చేస్తుంది
ఎప్పుడూ “త్వమేవ” “త్వమేవ” అంటూ వుండడం
మన గోతిని మనమే త్రవ్వుకోవడం లాంటిది
అయితే “త్వం” అన్న పదం చోట “అహం” అన్న పదం చేర్చుకోవాలి

ఎప్పుడూ “అహమేవ శరణం మమ” అనుకోవాలి
అంటే, “నాకు నేనే శరణు” అని ..
ఇదే సరియైన జీవన జ్ఞాన దృక్పథం

▲ **“భక్తి రోగం” అన్నది “త్వమేవ శరణు” అంటుంది**
**“ఆత్మయోగం” అన్నది “అహమేవ శరణు” అంటుంది.**

▲ **అంటే “నాకు నేనే దిక్కు” అన్నమాట.**

# శేషశయనుడు

| | | |
|---|---|---|
| శేషుడు | = | అది సర్పం |
| శేషశయనుడు | = | సర్పం మీద పడుకుని వున్నవాడు |

"అది సర్పం" అంటే అది కాలానికి ప్రతీక
అది కాలాన్ని సూచిస్తుంది
అందుకే "కాల సర్పం", "కాల నాగు" అంటారు
ఆది శేషుడుకి మరో పేరు "అనంతుడు"

"నాకు ఇరవై యేళ్ళు" .. "నాకు అరవై యేళ్ళు"
అనే అవగాహన లోంచి
సంపూర్ణంగా బయటపడి
"నేను అనంతకాలానికి చెందినవాడను"
అనే అవగాహనకు చేరిన వాడే
ఓ "శేషశయనుడు"

ఆత్మజ్ఞాన సంపన్నుడే ఓ "శేషశయనుడు"
ఆత్మజ్ఞాన హీనుడే "కాలం" అనబడే
సర్పం లోపలి అంధకారంలో కొట్టుకుపోతున్నవాడు

▲ **"నేను ఆత్మను" అని తెలుసుకోవాలి**
**"కాలం" అనే మాయలోంచి వైదొగలగాలి**

# కల్పతరువు - కామధేనువు - చింతామణి

ఇంద్రుడి దగ్గర ... దేవతల దగ్గర
**"కల్ప**తరువు" .. "**కామ**ధేనువు" .. "**చింతా**మణి"
మొదలయినవి వుంటాయి
వాటి ప్రాప్తి వలన
మనం **"ఏది కావాలి అంటే అది"** పొందవచ్చును
మన కోరికలన్నింటినీ తీర్చుకోవచ్చును
**"కల్పన"** అంటే **"మనోశక్తి"**
మన మనోశక్తి ద్వారా మనం సాధించలేనిది అంటూ ఏదీ లేదు
**"కామం"** అంటే **"కోరిక"**
మనం గట్టిగా ఏది కోరుకున్నా అది అచిరకాలంలో
మన దగ్గరకు వచ్చి తీరుతుంది
అలాగే **"చింతన"** అంటే **"మేధస్సు యొక్క ఉపయోగం"**
శాస్త్రీయ చింతన ద్వారానే అన్ని చిక్కులనూ విడదీయవచ్చు

కనుక **శుద్ధమైన కల్పన** యే అన్నీ ఇచ్చే **"కల్పతరువు"**
**సరియైన కామమే** అన్నీ ప్రసాదించే **"కామధేనువు"**
**శాస్త్రీయ చింతన** అన్నదే చిక్కులన్నీ విప్పే **"చింతామణి"**

ఇవన్నీ అందరి దగ్గర వున్నవే ... బయట ఎక్కడో లేవు
మన అంతర్ శక్తులను మనమే ఉద్దీపనం చేసుకోవాలి

▲ **మనం "ఇంద్రులం" అయితే మనం మన కామం, మన కల్పన, మన చింతనల ద్వారా ఏది కావాలి అంటే అది సృష్టించుకోవచ్చు.**

# బ్రహ్మోపదేశం - గురూపదేశం - ఉపనయనం

ఒక దీపం ఇంకొక దీపాన్ని వెలిగించినట్లు
ఒక యోగియే ఇంకొకరిని యోగిగా మలచగలడు
మనం యోగులుగా కావాలి అంటే "గురూపదేశం" అన్నది తప్పనిసరి
ఒకానొక ముముక్షువుకు ..
" 'అహంబ్రహ్మాస్మి", "తత్వమసి" అని ఎరుకపరచడం అన్నదే "బ్రహ్మోపదేశం"
"నేనే బ్రహ్మపదార్థాన్ని – "నువ్వు కూడా అదే" అని ఎరుకపరచడం అన్నమాట
అదే విధంగా **"ఉద్ధరేత్ ఆత్మ ఆత్మానాం"**
అంటే **"ఎవరిని వారే వుద్ధరించుకోవాలి"** అన్నదే
ఒకానొక సిద్ధ పురుషుడు, ఒకానొక గురువు
ఒకానొక ముముక్షువునకు ఇచ్చే "గురూపదేశం"

**"ఆనాపానసతి" ధ్యాన శిక్షణ అన్నదే "గురూపదేశం"**

గురువు కేవలం మార్గం చూపిస్తాడు
అంతేకానీ ఎవరికీ "ఉపనయనం" చేయలేడు
అది ఎవరికి వారు చేసుకోవలసిన చర్యే
"ఉప" అంటే "అదనంగా వున్న"
"నయనం" అంటే "కన్ను"
కనుక
**"ఉపనయనం"** అంటే **"మూడోకన్ను"** అంటే **"దివ్యచక్షువు"**
స్వీయ ధ్యానసాధన ఆధారంగా దివ్యచక్షువు ఉత్తేజితం అయినప్పుడే
మనకు మనం **"ఉపనయనం"** చేసుకున్నట్లు

- ▲ **యోగ సాధన ద్వారానే నాడీమండల శుద్ధి జరిగి మన 'ఉప' నయనం తెరచుకుంటుంది**
- ▲ **'ఉపనయన' లబ్ధి ద్వారానే బ్రాహ్మణత్త్వం, ద్విజత్త్వం సిద్ధిస్తాయి.**

# బ్రాహ్మణులు - ద్విజత్వం

బ్రాహ్మణులే **"ద్విజులు"**
తమ తమ పూర్ణాత్మలతో అనుసంధానం
పొందిన వారే **"ద్విజులు"**

**"బ్రహ్మ జ్ఞానాతి ఇతి బ్రాహ్మణః"**
**"బ్రహ్మజ్ఞానం ఉన్నవారే బ్రాహ్మణులు"**

అంతేకానీ
మామూలు పుట్టుక ద్వారా ఎవ్వరూ "బ్రాహ్మణులు" కాజాలరు.
**"ద్విజత్వం"** అంటే **"రెండవ పుట్టుక"**
మొదటి పుట్టుక శారీరకంగా తల్లిదండ్రుల నుంచి
పుట్టడాన్ని సూచిస్తుంది ... మన భౌతిక కాయాన్ని సూచిస్తుంది
**మొదటి పుట్టుక** ద్వారా అందరూ బ్రాహ్మణేతరులే! అందరూ శూద్రులే!
**రెండవ పుట్టుక** మన "ఆత్మ" గురించి మనకు ఎరుక పరుస్తుంది
ధ్యానయోగ సాధన ద్వారానే ద్విజత్వం లభిస్తుంది

జీసస్ అన్నాడు :
"నేను దేవుని కుమారుడను" అని
అంటే, తాను "ఒకానొక పూర్ణాత్మ యొక్క ఒకానొక అంశ" అని
తెలిసిన వాడు అన్నమాట
ప్రతి జీవీ ఒకానొక పూర్ణాత్మ యొక్క ఒకానొక అంశే!

▲ **తాము 'అంశాత్మలం' అని తెలుసుకున్నవాళ్ళే బ్రాహ్మణులు, ద్విజులు**

# ఉపనయనం - యజ్ఞోపవీతం

"ఉపనయనం" అయినవాడు ...
అంటే, బ్రాహ్మణత్వం పొంది ద్విజుడు అయినవాడు ...
ఇక తప్పనిసరిగా **"యజ్ఞోపవీతం"** ధరిస్తాడు

"యజ్ఞోపవీతం" అంటే " 'యజ్ఞం' అనబడే 'ఉపవీతం' "

**"యజ్ఞం" అంటే "పరుల సేవార్థమై చేసే కర్మ"**

స్వార్థవిరుద్ధకర్మలన్నమాట ... లోక కళ్యాణకరమైన చేష్టలన్నమాట
"ఉపవీతం" అంటే "బట్ట", "నూలు ప్రోగు"
"ఉపనయనం" అంటే "దివ్యచక్షువు"

**"ఉపనయనం అయిన వాడు యజ్ఞోపవీతం ధరిస్తాడు"**

అంటే
"దివ్యచక్షువును సంపాదించుకున్న ఒకానొక యోగి ఇంక తన సహచరుల ఆత్మజ్ఞానాభివృద్ధికి తన సర్వశక్తియుక్తులతో తోడ్పడతాడు"
అని అర్థం

**"జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం"**

అన్నాడు గీతాకారుడు

**"జ్ఞానం"** అనే అగ్నిలో అశుభకర్మలు దగ్ధమైన తరువాత ఇంక మిగిలివుండే శుభ, నిస్వార్థపూరక కర్మలే **"యజ్ఞం"**

▲ **అందుకే, జీసస్ ఆదేశించాడు -**
**"నీ సహచరులనూ నీలాగే ప్రేమించు" అని**

▲ **అంటే "యజ్ఞోపవీతధారణ చేయి" అన్నమాట**

# నిత్యాగ్ని హోత్రుడు

ఒకానొక బ్రాహ్మణుడికి
"నిత్యాగ్నిహోత్రం" అన్నది తప్పనిసరి కర్తవ్యం
"బ్రాహ్మణుడు" అంటే "బ్రహ్మజ్ఞానం కలిగినవాడు"
"బ్రాహ్మణుడు" అంటే "దివ్యచక్షువును సంపాదించుకున్న యోగి"

ఒకానొక పరమగురువు యొక్క కర్తవ్యం ఏమిటి?
**"నిత్యాగ్నిహోత్రం"**
"అగ్నిహోత్రం" అంటే "అగ్నిని ప్రజ్వలింపచేయడం"
"నిత్యాగ్నిహోత్రుడు" అంటే

**"ఎప్పుడూ అగ్నిని ప్రజ్వలింప చేస్తూ వుండేవాడు"**

జ్ఞాన వెలుతురుని ఇరవై నాలుగు గంటలూ విరజిమ్ముతూండేవాడు

**"అగ్ని" అంటే "జ్ఞానాగ్ని"**

అంటే "తులసీదళం"లోని మొదటి ఆకు :
**"ఉద్ధరేదాత్మనాత్మానం"**
**"అగ్ని"** అంటే **"యోగాగ్ని"** కూడా
అంటే "తులసీదళం" లోని రెండవ ఆకు :
**"నిరంతర ఆనాపానసతి – విపస్సన యోగసాధన"**
ఒకానొక యోగి, తాను "యోగి" అయిన తరువాత కూడా
తన సాధనలో నిరంతరంగా నిమగ్నుడై వుంటాడు
తన "దీపం" తగ్గకుండా ఎప్పుడూ చూసుకుంటూ వుంటాడు
అదే సమయంలో ఇతరుల "దీపాలను" కూడా దేదీప్యమానంగా
వెలిగించడానికి ఎప్పుడూ కృషి చేస్తూనే వుంటాడు

▲ **ప్రతి యోగీ నిత్యాగ్నిహోత్రుడే**

# సంధ్యా వందనం

**"సంధ్య" = "మధ్యలో వుండే సమయం"**

అది పగలూ కాదు, రాత్రీ కాదు ... రాత్రీ కాదు, పగలూ కాదు

సంధ్యా సమయం **"మార్పు"** సమయం కూడా

పగలు పోయి రాత్రి వచ్చే సమయం

రాత్రి పోయి పగలు వచ్చే సమయం

ప్రకృతి ఎల్లవేళల్లోనూ అత్యంత రమణీయం అయినా

సంధ్యాసమయాల్లో మటుకు దాని రమణీయత ప్రత్యేకంగా అద్భుతం

సంధ్యాసమయానికి గల ప్రత్యేకతలో నిమగ్నం కావడమే, తన్మయత్వం

చెందటమే... "సంధ్యావందనం చేయటం" అంటే

"వందనం" అంటే "సగౌరవంగా గుర్తించడం"

**"సంధ్యా సమయం"** ఎన్నో ఆధ్యాత్మిక జ్ఞాన పాఠాలను నేర్పిస్తుంది :

ఉదాహరణకు : "అన్నీ ఎప్పుడూ మారుతూ వుంటాయి" అని

"ఏదీ ఎప్పుడూ స్థిరంగా వుండదు" అని

"మార్పును ఆపగోరడం అసంభవం, అవాంఛనీయం" అని

"everything is transient" అన్నదే మౌలిక బుద్ధ సూత్రం

**"సంధ్యా వందనం చేయడం"**

అంటే

"ప్రకృతి మనకు నిరంతరం నేర్పించే

ఆధ్యాత్మిక పాఠాలను సగౌరవంగా గుర్తించి పాటించడం"

ప్రకృతిలో తాదాత్మ్యం చెంది ఆ రమణీయతను ఆస్వాదించినప్పుడు

మనలో విశ్వశక్తి cosmic energy ద్విగుణీకృతం, త్రిగుణీకృతం అవుతుంది

- **కనుక విధిగా 'సంధ్యావందనం' ఆచరించాలి**
- **తద్వారా కావలసిన రోజువారీ జ్ఞానాన్నీ, ఆనందాన్నీ, శక్తినీ సమీకరించుకోవాలి.**

# అంశాత్మ - పూర్ణాత్మ

మనం "అంశ" ఆత్మలం
మనం అంతా "ఋషి పుత్రులం"
మనం అంతా "క్రింద" వున్న ఆత్మలం

"సత్యలోకాలలో" అంటే "మహాకారణలోకాలలో" వున్న
"ఒకానొక 'పూర్ణాత్మ' యొక్క ఒకానొక అంశ "మనం అన్నమాట
"అంశాత్మ" ... "పూర్ణాత్మ"

ఎప్పుడైతే మనం పూర్తిగా ఆత్మ పరిణితి చెందుతామో
అప్పుడు మనం కూడా ఆ మహాకారణలోకాలనూ చేరుతాం
అప్పుడు మనం కూడా మనలో నుంచి నూతన అంశాత్మలను సృష్టి చేస్తాం
అంటే మనమూ "పూర్ణాత్మ" స్థితి చేరుతామన్నమాట

ముండకోపనిషత్‌లో ఈ విధంగా వుంది :
**"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే**
**తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి॥"(3.1.1)**

"రెండు పక్షులు .. అంటే అంశాత్మ, పూర్ణాత్మ
ఎప్పుడూ ఒకే చెట్టు మీద ... అంటే శరీరం మీద .. కలిసి వుంటాయి
రెండూ అందమైన ఈకలతో ఒకే రకంగా వుంటాయి
వాటిలో ఒకటి తియ్యటి పండ్లను తింటుంది
రెండవది దేనినీ తినకుండా ఊరకనే చూస్తూ కూర్చుని వుంటుంది"

▲ **ధ్యానంలో పరాకాష్ట అంటే పూర్ణాత్మతో అనుసంధానం కలిగి వుండటం**
▲ **"పూర్ణాత్మ" అంటే "ద్వా సుపర్ణా" అనే ఋగ్వేద వాక్యాలలో వున్న "రెండవ పక్షి" అంటే "పైన వుండే పక్షి" అన్నమాట.**

# బ్రహ్మ మానసపుత్రులు

ఎప్పుడైతే మనం కూడా పూర్ణాత్మ స్థితికి చేరగలమో చేరుతామో
అప్పుడు మనం కూడా మనలో నుంచి అంశలను వేరుగా ఏర్పరచగలం
వీరే **"బ్రహ్మ - మానస - పుత్రులు"**

అప్పుడు మనం కూడా వాళ్ళను 'క్రింద' వున్న కారణలోకాలకు పంపి
ఒకప్రక్క మన స్వంత పనులను మనం చూసుకుంటూనే
మరో ప్రక్క
వారి బాగోగులను కూడా చూసుకుంటూ ఉండడం జరుగుతుంది

వీరు కూడా యథావిధిగా "జనన–మరణ చక్రం"లో చేరి పాఠాలన్నీ
నేర్చుకోవలసిందే ఎవరి స్వేచ్ఛ ప్రకారం వారు విహరిస్తూ వుంటారు ...
విధిగా పురోగమిస్తూనే వుంటారు

మనం పూర్ణాత్మలుగా మారిన తర్వాతే మన స్వంత
మానస పుత్రులను సృష్టించడం సాధ్యమవుతుంది

▲ **ప్రతి పూర్ణాత్మా ఒకానొక 'బ్రహ్మ'**
**అందుకే మానసపుత్రులు "బ్రహ్మ మానస పుత్రులు"**


**పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ - ఇండియా**

ధ్యానం గురించి మరింత సమాచారం కొరకు ఈ క్రింది వెబ్‌సైట్‌లను దర్శించండి.
**1) www.pssmovement.org, 2) www.meditationeverywhere.org,**
**3) www.pyramidvalley.org, 4) www.pyramidseverywhere.org,**
**5)www.thepyramidradio.com**

**తెలుగులో సమాచారం కొరకు http://pssmovement.org/telugu/**

**పిరమిడ్ మెడిటేషన్ ఛానల్ వీక్షించండి, సబ్‌స్క్రైబ్ చేసుకోండి**

**PMC App డౌన్‌లోడ్ చేసుకోండి.**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటిభాగం) | - | రూ.100/- |
| 2) జీవితశాస్త్రం (రెండవభాగం) | - | రూ.130/- |
| 3) జీవిత సత్యాలు | - | రూ.100/- |
| 4) భగవంతుడంటే | - | రూ.130/- |
| 5) సత్యమార్గం | - | రూ.130/- |
| 6) ఆత్మ శాస్త్రం | - | రూ.100/- |
| 7) ధ్యాన శాస్త్రం | - | రూ.100/- |
| 8) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) | - | రూ.100/- |
| 9) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) | - | రూ.100/- |
| 10) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | - | రూ.130/- |
| 11) ధ్యాన శక్తి | - | రూ.100/- |
| 12) తెలుసుకోండి | - | రూ.120/- |
| 13) జీవిత సూక్ష్మాలు | - | రూ.120/- |
| 14) గీతాసందేశం | - | రూ.100/- |
| 15) కర్మ సిద్ధాంతం | - | రూ.80/- |
| 16) బ్రహ్మాజ్ఞానం | - | రూ.60/- |
| 17) ఆత్మజ్ఞానం ఎందుకు? | - | రూ.70/- |
| 18) ధ్యానమంటే ? | - | రూ.50/- |
| 19) జ్ఞాన జ్యోతి | - | రూ.70/- |
| 20) జ్ఞాన కుసుమాలు | - | రూ.70/- |
| 21) దుఃఖ నివారణామార్గం | - | రూ.60/- |
| 22) త్రివిధాలు | - | రూ.60/- |
| 23) ధ్యానం (పత్రీజీ) | - | రూ.50/- |
| 24) ధ్యానం వల్లనే జ్ఞానం | - | రూ.60/- |
| 25) అతీంద్రియ శక్తులు | - | రూ.60/- |
| 26) శాస్త్రాల అర్థం- అంతరార్థం | - | రూ.60/- |
| 27) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - | రూ.60/- |
| 28) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - | రూ.50/- |
| 29) మౌన ధ్యానం | - | రూ.40/- |
| 30) ఈ జీవితం ఎందుకు? | - | రూ.50/- |
| 31) నిర్వాణ మార్గం | - | రూ.50/- |
| 32) షిరిడీసాయి సందేశాలు | - | రూ.40/- |
| 33) భాగవత సన్నివేశాల అంతరార్థం | - | రూ.40/- |
| 34) భూతదయే దైవత్వం | - | రూ.40/- |
| 35) ఆలోచించండి | - | రూ.60/- |
| 36) సంకల్పమంటే? | - | రూ.50/- |
| 37) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) | - | రూ.30/- |
| 38) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | - | రూ.20/- |
| 39) శాకాహారమే మానవాహారం | - | రూ.15/- |
| 40) అహింస మరియు శాఖాహారం | - | రూ.15/- |

పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**
తటవర్తి వారి వీధి, భీమవరం-534 201. (ప॥గో॥జిల్లా.)
ఫోన్ : 9490171853, సెల్ : 9440309812



మనిషి తన ఆత్మపరిణామక్రమంలో

**నాస్తికత్వం** నుంచి **ఆస్తికత్వం**లోకి వచ్చిన తరువాత

మూఢభక్తిలో మొదట 'పరవశుడు' అవుతూ వుంటాడు

"పరవశుడు" అంటే "పరులకు వశుడు అయినవాడు" అని అర్థం

కానీ, తరువాత

**"ధ్యానం వల్లనే జ్ఞానం, జ్ఞానం వల్లనే ముక్తి"**

అనే పరమ సూత్రాన్ని క్రమ క్రమంగా తెలుసుకుంటూ

తీవ్ర సాధనల ద్వారా అష్ట సిద్ధులనూ స్వాధీనం చేసుకుంటూ

**పరమగురువు** స్థాయి కి చేరుకుంటాడు

"స్వవశుడు" అవుతాడు

ఆ స్థాయికి చేరుకున్న వాళ్ళనే సామాన్య ఆస్తికులూ

వారి భక్తులు, అయినవాళ్ళూ "దేవుడు" అంటున్నారు

**అలా దివ్యత్వం సాధించిన మానవుడే 'దేవుడు'**

**- బ్రహ్మర్షి పత్రీజీ**

రూ. 60/-